విశాలాంధ్ర



ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

మంగళవారం 05 ఆగస్టు 2025   8 పేజీలు

సౌకర్యాలు లేని జగనన్న కాలనీలు

- గత పాలకులకు కాసుల వర్షం కురిపించిన భూసేకరణ
- విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్సుమెంటుతో విచారణ చేయించాలని డిమాండ్

విశాలాంధ్ర-కొవ్వూరు : జిల్లాలో పేదలకు నిర్మించి ఇచ్చిన జగనన్న కాలనీ ఇళ్లు అసౌకర్యాలకు నిలయంగా మారాయి. తాంబూలాలు ఇచ్చాం...తన్నుకు చావండి అన్న చందాన గత ప్రభుత్వం ప్రైవేట్ భూములను కొనుగోలు చేసి పట్టణంలో సెంటు గ్రామీణ ప్రాంతాలలో సెంటున్నర చొప్పున కేటాయించి పట్టాలను పంపిణీ చేశారు. లబ్ధిదారులకు కేంద్ర ప్రభుత్వం 1,80,000 కేటాయించగా కూటమి ప్రభుత్వం వచ్చాక బీసీలు, ఎస్సీలు, ఎస్టీలకు అదనంగా రూ.50,000 చొప్పున కేటాయించింది. అప్పటివరకు కుంటి నడకన నడిచిన ఇళ్ల నిర్మాణాలు కాస్త వేగం పుంజుకున్నాయి. కాలనీలు కేటాయించి స్థలాలు పంపిణీ జరిగాయి తప్ప ఆ కాలనీలో మౌలిక సదుపాయాలైన రోడ్లు, తాగునీరు, వీధిలైట్లు వంటి ముఖ్యమైన సౌకర్యాలు ఏర్పాటు చేయడంలో గత ప్రభుత్వం విఫలమైంది. దీంతో ప్రస్తుతం ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి కాపురముంటున్న కుటుంబాలు కనీస సౌకర్యాలు లేక విలవిలాడుతున్నారు. ఈ సౌకర్యాలను ఏర్పాటు చేయమని స్థానిక సంస్థలకు అప్పగించడంతో గత ప్రభుత్వ నిర్ణయం స్థానిక సంస్థలకు గుది బండగా తయారైంది. అసలే అంతంత మాత్రమే ఆదాయం కలిగి ఉన్న పంచాయతీలు మున్సిపాలిటీలు ఈ భారం మోయలేక ▶మిగతా 2లో..

పారిశుద్ధ్య పనులు పగడ్బందీగా నిర్వహించాలి

కలెక్టర్ ప్రశాంతి

విశాలాంధ్ర - రాజమండ్రి సిటీ: నగరంలో పారిశుద్ధ్య పనులను ఫిర్యాదులు రాకుండా పగడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్, కమిషనర్(ఎఫ్ ఎసి) పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. ఐవీఆర్ఎస్‌లో పూర్ పెర్ఫార్మన్స్ ఉన్న మఠం వీధి సహా పలు ప్రాంతాలలో సోమవారం నగర ఆరోగ్యశాఖాధికారి వినూత్నతో కలిసి ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలో ఎన్ని గృహాలు ఉన్నదీ, ఎంత మంది పారిశుద్ధ్య సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. పారిశుధ్యం, సైడ్ ▶మిగతా 2లో..

19న ప్రదర్శన, బహిరంగ సభ విజయవంతం చేయాలి

సీపీఐ ప.గో.జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు

విశాలాంధ్ర -తణుకు: ఈనెల 19,20 తేదీలలో తణుకులో జరుగనున్న సీపీఐ 27 వ జిల్లా మహాసభలు విజయవంతం చేయాలని సీపీఐ పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు పిలుపునిచ్చారు.సోమవారం తణుకు వంక సత్యనారాయణ సురాజ్య భవన్‌లో పార్టీ మహాసభల ప్రజా ప్రదర్శన, బహిరంగ సభల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భీమారావు మాట్లాడుతూ మహాసభల సందర్భంగా ఈనెల 19న తణుకు పట్టణంలో జరుగనున్న ప్రజా ప్రదర్శన, బహిరంగ సభలకు సీపీఐ, ప్రజా సంఘాల శ్రేణులు అధికసంఖ్యలో హాజరై ▶మిగతా 2లో..

నిర్ణీత గడువులోగా అర్జీలకు పరిష్కారం

కలెక్టర్ షణ్మోహన్

విశాలాంధ్ర - కాకినాడ : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ ప్రజల నుంచి అందిన అర్జీలకు నిర్ణీత గడువులోపు పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కాకినాడ కలెక్టర్ కార్యాలయం వివేకానంద హాలులో నిర్వహించిన జిల్లా స్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమంలో కలెక్టర్ షణ్మోహన్, జేసీ రాహుల్ మీనా, జిల్లా రెవెన్యూ అధికారి జె. వెంకటరావు, ట్రైనీ కలెక్టర్ జె. మనిషా, సీపీవో పి.త్రినాథ్, బీసీ కార్పొరేషన్ ఈడి ఎ.శ్రీనివాసరావు, ఎస్ఎస్ఏ పీవో వేణుగోపాల, ఎస్డీసీ జీజీహెచ్ ఎన్. శ్రీధర్‌లతో కలిసి ప్రజల నుంచి ఆర్జీలను స్వీకరించారు. అర్జీదారుల సమస్యలను ఆయన ఆలకించి, వారి అర్జీలపై సత్వర పరిష్కారం అందించాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ప్రధానంగా రేషన్ కార్డులు, పింఛన్లు, ఇళ్ల స్థలాలు, ఆక్రమణల తొలగింపు, ఉపాధి కల్పన, తల్లికి వందనం, భూములు ఆన్ లైన్, సదరమ్ సర్టిఫికెట్ల జారీ తదితర వ్యక్తిగత సమస్యలతో పాటు, ఆయా ఆవాసాల్లో ఎదుర్కొంటున్న సామాజిక సమస్యలపై ప్రజల నుంచి 580 అర్జీలు అందగా వాటన్నింటినీ ఆర్ఎస్ పోర్టల్‌లో ఆన్ లైన్‌లో అప్ లోడ్ చేసి, అర్జీదారులకు రశీదులు అందజేసారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ ప్రజల నుంచి అందిన ప్రతి అర్జీని నిర్దిష్ట కాలపరిమితి లోపు పరిష్కారాలను అందించాలన్నారు. ఒకే అంశంపై మళ్లీ మళ్లీ దరఖాస్తు నమోదు అయ్యే అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు, కలెక్టర్ కార్యాలయ సెక్షన్ సూపరింటెండెంట్లు తదితరులు పాల్గొన్నారు.

వాట్సాప్ గవర్నెన్స్‌పై అవగాహన కల్పించాలి : కలెక్టర్

పీ4, హర్‌ఘర్ తిరంగాపై సమీక్ష

విశాలాంధ్ర-ఏలూరు: వాట్సాప్ గవర్నెన్స్‌పై ప్రజలకు విస్తృత అవగాహన కలిగించేందుకు ప్రతి నెల 5వ తేదీన జిల్లాలోని అన్ని సచివాలయాల పరిధిలో ర్యాలీలు నిర్వహించాలని కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. సోమవారం ఏలూరు కలెక్టరేట్ నుండి వాట్సాప్ గవర్నెన్స్, పీ4, హర్‌ఘర్ తిరంగా, తదితర కార్యక్రమాలపై అధికారులతో టెలి కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ దేశంలోనే తొలిసారిగా ఆంధ్రప్రదేశ్‌లో వాట్సాప్ గవర్నెన్స్‌ను తీసుకువచ్చినట్టు తెలిపారు. 9552300009 ఫోన్ నెంబర్ ద్వారా 570లకు పైగా సేవలు అందించనున్నట్టు పేర్కొన్నారు. ప్రజలు వాట్సాప్ గవర్నెన్స్ సౌకర్యాన్ని వినియోగించుకునేందుకు వాట్సాప్ గవర్నెన్స్ నెంబర్‌ను ప్రజలందరికీ తెలిసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ర్యాలీలలో గ్రామస్థాయిలో విఆర్వోలు, విలేజ్ సర్వేయర్లు, అగ్రికల్చర్, హార్టికల్చర్, సిరికల్చర్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు తదితర శాఖల ప్రభుత్వ సిబ్బంది పాల్గొనాలని, ఈ ర్యాలీలో పాల్గొని అవగాహన కల్పించాలన్నారు. హర్ ఘర్ తిరంగ్ ▶మిగతా 2లో..

చేనేత రంగాన్ని ప్రోత్సహించాలి

ఇన్‌చార్జి కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి

విశాలాంధ్ర -భీమవరం: చేనేత రంగాన్ని ప్రోత్సహించా లని ఇన్‌చార్జి కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చేనేత వస్త్రాల ప్రదర్శన, అమ్మకాలను ఆయన సందర్శించారు. స్టాల్స్ లో ఏర్పాటు చేసిన ఉప్పాడ పట్టు చీరలు, మంగళగిరి కాటన్ చీరలు, డ్రెస్ మెటీరియల్, వివిధ రకాల చేనేత వస్త్రాల నాణ్యత, ధరల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలో భాగమైన చేనేత కళను సంరక్షించుకోవాల్సిన బాధ్యత ఎంతైనా ఉందన్నారు. ప్రతి సంవత్సరం ఆగస్టు 7వ తేదీన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలచే జాతీయ చేనేత దినోత్సవం జరుపు కుంటున్నామన్నారు. ఈ సందర్భంగా ఆగస్టు 7వ తేదీన ఉదయం 9.00 గంటలకు భీమవరం పట్టణంలోని ప్రకాశం చౌక్ నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు చేనేత ర్యాలీ నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు. చేనేత జౌళి శాఖ అధికారి కె.అప్పారావు, స్టాల్ మేనేజర్ పి.అనిల్ కుమార్, ఆప్కో సిబ్బంది, తదితరులు ఉన్నారు.

ఇన్‌స్పైర్ అవార్డ్సు మానక్ 2025-26 పోస్టర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర -ఏలూరు: ఇన్‌స్పైర్ అవార్డ్స్ మానక్ 2025-26 కు సంబంధించిన పోస్టర్ ను జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డితో కలిసి కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆవిష్కరించారు.ఇన్స్పైర్ అవార్డ్స్ మానక్ 2025-26 స్కీం విద్యార్థులలో అవగాహన, సామర్థ్య పెంపుదలకు బాగా ఉపయోగపడు తుందన్నారు.

విజ్ఞాన, సాంకేతిక రంగాలలో సమా జానికి ఉపయోగ పడే నూతన ఆవిష్కరణలు చేయాలని కలెక్టర్ ఆకాంక్షించారు. దీనికి 6వ తరగతి నుండి ప్లస్ టు వరకు చదువుతున్న ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలల విద్యార్థులందరూ పాల్గొనేందుకు అర్హులన్నారు. యూపీ పాఠశాలలు 3, ఉన్నత పాఠశాలలు 5, ప్లస్ టు పాఠశాలలు 7 ప్రాజెక్టులు నమోదు చేయాలన్నారు. చివరి తేదీ సెప్టెంబర్ 15. మరిన్ని వివరాలకు జిల్లా సైన్స్ ఆఫీసర్ వారిని సంప్రదించవచ్చు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి యం. లక్ష్మమ్మ,, అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ పంకజ్ కుమార్, జడ్పీ సీఈఓ శ్రీహరి,జిల్లా సైన్స్ ఆఫీసర్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో స్నేహితుల దినోత్సవం

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : స్నేహితుల దినోత్సవాన్ని వృద్ధ ఆశ్రమంలో జరుపుకోవడం ఆనందదాయకంగా ఉందని రోటరీ క్లబ్ అధ్యక్షులు మాదేటి సత్యనారాయణ పేర్కొన్నారు. స్థానిక రోటరీ క్లబ్ కల్పవృక్ష వృద్ధాశ్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు వృద్ధుల మధ్య స్నేహితుల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. వృద్ధులతో కలసి కేక్ కటింగ్ చేసి ఫ్రెండ్షిప్ బ్యాండ్లను చేతులకు కట్టుకున్నారు.

వృద్ధుల కళ్ళల్లో ఆనందాలు నెలకొన్నాయి. సత్యనారాయణ మాట్లాడుతూ చిన్న వయసులో పాఠశాలల్లో చదువుకుంటూ వృద్ధాప్యం వయసు వచ్చేవరకు కలసిమెలసి ఉంటూ కుల మతాలకు అతీతంగా ఉండేదే స్నేహితులని, స్నేహితుల దినోత్సవం నిర్వహించడం సంతోషకరమని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ గవర్నర్ అయిలూరి విశ్వనాథ శర్మ, కనికెళ్ళ రామచంద్రం, చిరావూరి శ్రీనివాస్, చోడి పిండి సుబ్రహ్మణ్యం, మాదేటి అప్పలరాజు, మజ్జి సూరిబాబు, యాతం సత్యనారాయణ, మద్దు గోపి, దారం సత్తిరాజు, మానేపల్లి రామారావు, గుడిమెట్ల గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్ఎంలకు శిక్షణ

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : వ్యాధి నిరోధక టీకా కార్యక్రమాన్ని యువిన్ పోర్టల్‌లో ఆన్లైన్ చేయాలని యువిన్ డివిజన్ కోఆర్డినేటర్ ఎం.సామిత్ పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వద్ద సోమవారం కొయ్యలగూడెం, బయ్యనగూడెం, కోట రామ చంద్రపురం, ప్రభుత్వ

ఆసుపత్రుల ఏఎన్ఎం లకు శిక్షణ నిర్వహించారు. ఏలూరు నుంచి వచ్చిన ట్రైనర్ సామిత్ మాట్లాడుతూ ఇమ్యునైజేషన్ కార్యక్రమం డిజిటలైజేషన్ ప్లాట్ ఫారంకు మారిందన్నారు. టీకాలు వేయడానికి ఆన్లైన్లో స్లాట్ బుక్ చేసుకుని వ్యాక్సిన్ తీసుకువెళ్లి పిల్లలకు వేయాలని, పిల్లలందరినీ యు విన్ లో ఆన్లైన్ చేయాలని, అదే రోజు వ్యాక్సినేషన్ సర్టిఫికేట్ డౌన్లోడ్ చేసి లబ్ధిదారునికి అందజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో యు విన్ విసిఎంఎన్ గిరి సతీష్, బయ్యనగూడెం పి హెచ్ సి ఆరోగ్య విస్తరణ అధికారి సుబ్రహ్మణ్యం, కొయ్యలగూడెం సిహెచ్ఓ కె. గంగాదేవి, పీహెచ్ఎన్ సుభద్ర కుమారి, శైలజ, ఎంఎల్ హెచ్ పి లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు

(1వ పేజీ తరువాయి)

డ్రెయిన్ల నిర్వహణ విధానాన్ని పరిశీలించి సిబ్బందికి పలు ఆదేశాలిచ్చారు. ఇంటింటికి చెత్త సేకరణ నూరుశాతం జరగాలన్నారు. వారానికొకసారి ప్రతి వీధిలో పూడికతీత పనులు చేపట్టాలని, డ్రైనేజీ కాలువ లపై ఆక్రమణలు ఉంటే పట్టణ ప్రణాళిక విభాగం అధికారులతో సమన్వయం చేసుకుని తొలగించాలని ఆదేశించారు. డ్రైనేజీ కాలువల్లో పైపులు, ఇతరత్రా ఆటంకాలు ఉంటే ఇంజనీరింగ్ విభాగం అధికారుల దృష్టికి తీసుకెళ్లి తొలగించాలని సూచించారు. ఇకపై ప్రతివారం ఐవీఆర్ఎస్ జరుగుతుందని, కనుక పారిశుద్ధ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అనంతరం కాలనీ వాసులతో మాట్లాడి స్థానిక సమస్యలపై ఆరా తీశారు. ప్రజలు కూడా వ్యక్తిగతంగా పారిశుద్ధ్య కార్యక్రమాలలో భాగస్వామ్యం పంచుకుంటేనే నగరం మరింత సుందరీకరణ దిశగా అడుగులు వేస్తుందని ఈ సందర్భంగా సూచించారు. నగరంలోని ప్రతిఒక్కరికీ ఆరోగ్యకరమైన, పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించడమే లక్ష్యంగా నగరపాలక సంస్థ ముందుకు వెళుతున్నట్లు చెప్పారు.

విజయవంతం చేయాలి

(1వ పేజీ తరువాయి)

విజయవంతం చేయాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలుపై ముఖ్యంగా గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్లు ఇళ్ళ స్థలాలిచ్చి పేదల సొంతింటి కల నెరవేరుస్తామన్న కూటమి ప్రభుత్వ హామీ సూపర్ సిక్స్ హామీల అమలుకు కేంద్రంలో మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న రాజ్యాంగ వ్యతిరేక చర్యలు, కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలపై మహాసభలలో చర్చించి పోరాట కార్యాచరణ రూపొందించనున్నట్లు పేర్కొన్నారు. మహాసభల విజయవంతానికి అందరూ సహకరించాలని భీమారావు కోరారు. సీపీఐ తణుకు పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు, ఏరియా కార్యదర్శి సికిలే పుష్పకుమారి, పట్టణ కమిటీ సభ్యులు గార ప్రసాద్, గుబ్బల వెంకటేశ్వరరావు, పుట్టా అమ్మిరాజు, బొద్దాని మురళి, నూనె రాధాకృష్ణ, బొద్దాని కృష్ణ కిషోర్ పాల్గొన్నారు.

జగనన్న కాలనీలు

(1వ పేజీ తరువాయి)

సతమతమవుతున్నాయి. ఉదాహరణకు రెవెన్యూ డివిజన్ కేంద్రమైన కొవ్వూరులో మూడు కాలనీలను ఏర్పాటు చేశారు. వాటిలో ఇప్పటికీ పూర్తిస్థాయి మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంతో ఇళ్లను నిర్మించుకున్న వారు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. మూడవ శ్రేణి మున్సిపాలిటీ అయిన కొవ్వూరు ఆదాయం పట్టణాభివృద్ధికి సరిపోలేని పరిస్థితి. ఈ నేపథ్యంలో మౌలిక సదుపాయాలు ఏర్పాటు కష్టతరంగా మారిందన్న వ్యాఖ్యలు అధికార వర్గాల నుంచి వినిపిస్తోంది. ఈ కాలనీలకు తాగునీటిని వాటర్ ట్యాంకుల ద్వారా సప్లై చేయడమే ఒక ఉదాహరణగా పేర్కొనవచ్చు. మౌలిక సదుపాయాలు పూర్తిస్థాయిలో జరగాలంటే వచ్చే ఏడాది నిర్వహించనున్న పుష్కరాల వరకు వేచి చూడాల్సిందే అన్న వాదన వినిపిస్తోంది. ఎందుకంటే పుష్కరాల నిర్వహణ కోసం ప్రభుత్వం విడుదల చేసే ప్రత్యేక నిధులు కాలనీల అభివృద్ధికి కేటాయించే అవకాశం కనిపిస్తోంది.

గత పాలకులకు కాసుల కురిపించిన కాలనీల భూసేకరణ?

జగనన్న కాలనీలు ఏర్పాటు కోసం ప్రభుత్వ భూమి అందుబాటులో లేని చోట్ల రైతుల నుంచి పొలాలను కొనుగోలు చేసి లబ్ధిదారులకు కేటాయించారు. ఈ భూసేకరణ సమయంలో ఆయా భూములకు మార్కెట్ ధర కంటే అప్పటికి ఉన్న ధర కంటే ఎక్కువ చూపించి అందులో అధికంగా వచ్చిన డబ్బులను కమీషన్ల రూపంలో గత పాలకులు పంచుకున్నారన్న ఆరోపణలు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి. దీనికోసం అప్పటి రెవెన్యూ ఉన్నతాధికారులపై ఒత్తిడి తెచ్చి తమ పబ్బం గడుపుకున్నారన్న వాదనలు సైతం లేకపోలేదు. జిల్లా వ్యాప్తంగా కాలనీల కోసం జరిగిన భూ సేకరణలో ఇటువంటి సంఘటనలు అనేకం జరిగాయని ప్రతిపక్షం సైతం ఆనాడు విమర్శించింది. అదే ప్రతిపక్షం ప్రస్తుతం కూటమి రూపంలో అధికారంలో ఉన్నందున ఈ భూసేకరణ పై విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులతో విచారణ చేయిస్తే అసలు విషయం బయటపడుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

పకోడీల్లా అమ్ముడవుతున్న కాలనీ స్థలాలు

ఇంటి సామగ్రి ధర విపరీతంగా పెరిగిపోవడంతో సామాన్యులు ఇళ్లను నిర్మించుకోలేకపోతున్నారు. ప్రస్తుతం నిర్మించిన వారు కూడా అప్పో సప్పో చేసి ఇళ్లను నిర్మించుకున్నారు. మరొకవైపు ఇళ్లను నిర్మించకపోతే పట్టాలను రద్దు చేస్తామని అధికారులు చెబుతుండడంతో కొందరు లబ్ధిదారులు తమకు కేటాయించిన స్థలాలను అమ్ముకుంటున్నారన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. దీనికి తోడు రియల్ ఎస్టేట్ రంగంలోని మధ్యవర్తులు లబ్ధిదారులకు ఆశ చూపి వాటిని విక్రయించి పెద్ద ఎత్తున కమీషన్లు దండుకుంటున్నారన్న విమర్శలు సైతం లేకపోలేదు. తమ స్థలాలను విక్రయించే సమయంలో కొనుగోలుదారులకు స్టాంప్ పేపర్ పై రాసి అందులో ఇళ్ల నిర్మాణం జరిగే వరకు వచ్చే బిల్లులను ఇస్తామని అవసరమైతే సంతకాలతోపాటు ఆ ఇంటి ముందర ఫోటోలకు సైతం దిగుతామని హామీ ఇవ్వడంతో అధికారులు కూడా ఏమి చేయలేకపోతున్నారు.

మానసిక ఒత్తిడిలో గృహ నిర్మాణ శాఖ అధికారులు

ఒకవైపు ముహూర్తాలకు మంచి రోజులైన శ్రావణమాసం రానే వచ్చింది. ఈ నెలలో రాష్ట్ర వ్యాప్తంగా ను జిల్లా వ్యాప్తంగా నిర్మాణాలు లబ్ధిదారులతో పూర్తి చేయించి గృహప్రవేశాలు చేయించాలని ప్రస్తుత ప్రభుత్వం గృహ నిర్మాణ శాఖ అధికారులను ఆదేశించింది. అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి లబ్ధిదారులకు అవగాహన శిబిరాలు నిర్వహిస్తున్నా ఫలితాలు మాత్రం కానరావడం లేదు. ప్రస్తుత ప్రభుత్వం బీసీ, ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు అదనంగా ఇస్తున్న రూ.50,000 కూడా మూడు దశల్లో ఇవ్వడంతో పెద్దగా ఫలితాలు కనిపించడం లేదు. ప్రభుత్వం విధించిన టార్గెట్ రోజులు దగ్గర పడుతుండడంతో గృహ నిర్మాణ శాఖ అధికారులు మానసిక ఒత్తిడికి గురవుతున్నారన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

అవగాహన కల్పించాలి

(1వ పేజీ తరువాయి)

కార్యక్రమంపై ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. బంగారు కుటుం బాల దత్తత పై ప్రత్యేక చొరవ తీసుకుని సంబంధిత పారిశ్రామికవేత్తలు,ఎన్ఆర్ఐ లు,ఇలా అన్ని వర్గాల వారు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి దత్తత తీసుకునే మార్గదర్శుల జాబితాను సిద్ధంచేసి బంగారుకుటుంబాలకు అనుసంధానం చేయాలన్నారు. బంగారు కుటుంబాల దత్తత స్వచ్ఛందమేనని, మార్గదర్శకుల అభీష్టమే తుది నిర్ణయమని కలెక్టర్ చెప్పారు. ఈనెల 15వ తేదీ నాటికి రాష్ట్ర వ్యాప్తంగా 15 లక్షల బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేలా చేసిన ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా జిల్లాకు కేటాయించిన లక్ష్యాలను త్వరితగతిన పూర్తిచేయాలన్నారు.

బస్సును నిర్దేశించిన ప్రదేశంలో ఆపండి

విశాలాంధ్ర- ఉంగుటూరు : జంగారెడ్డిగూడెం నుంచి భీమవరం వెళ్లే ఆర్టీసీ బస్సు నారాయణపురంలో ఎక్కడ ఆపుతారో తెలియక ప్రయాణికులు

ఇబ్బందులు పడు తున్నారని ఎంపీటీసీ సభ్యుడు బందారు నాగ రాజు పిజి ఆర్ఎస్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. ప్రయాణికులకు అనుకూలంగా ఉండేలా ఒక ప్రదేశాన్ని గుర్తించి తాత్కాలిక బస్టాండ్‌ను ఏర్పాటు చేయాలని నాగరాజు ఉంగుటూరు ఎంపీడీవో గంజి రాజు మనోజ్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఆర్టీసీ అధికారుల దృష్టికి తీసుకెళ్తానని ఎంపీడీవో మనోజ్ తెలిపారు.

మోరంపూడి రాజా హఠాన్మరణం

విశాలాంధ్ర-లింగపాలెం: పాలవాగు సప్లై ఛానల్ నీటి సంఘ అధ్యక్షులు మోరంపూడి ప్రసాద్ తండ్రి రాజా గుండె పోటుతో హఠాన్మరణం చెందారు.

ఈయన మృతి పట్ల గ్రామంలోని పార్టీల రహితంగా నాయకులు సంతాపం తెలిపారు. ఎమ్మెల్యే రోషన్ కుమార్ రాజా మృత దేహానికి నివాళులర్పించారు. మంచి వ్యక్తిగా పేరున్న రాజా మృతి పట్ల ప్రతి ఒక్కరు ఆవేదన వ్యక్తం చేశారు.ఈయనకు భార్య,ఇరువురు కుమారులు ఉన్నారు.

తపన ఫౌండేషన్ సేవలతో నిరుపేదలకు లబ్ది

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : ఉచిత కుట్టు శిక్షణ తీసుకున్న మహిళలు తమ కాళ్ళ మీద తాము నిలబడడానికి కుట్టు మిషన్ శిక్షణ ఎంతో ఉపయోగపడు తుందని కూటమి పార్టీల నాయకులు పేర్కొ న్నారు. మండలంలోని బయ్యనగూడెం గ్రామంలో తపన ఫౌండేషన్ ద్వారా ఉచిత కుట్టు మిషన్ శిక్షణ పొందిన

మహిళలకు సోమ వారం సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా కూటమి పార్టీల నాయకులు మాట్లాడుతూ మహిళలు ఇంటి వద్దనే ఉంటూ ప్రతిరోజు వారి జీతం వారు సంపాదించుకోవడానికి కుట్టు మిషన్ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. మెట్ట ప్రాంతంలో తపన ఫౌండేషన్ ద్వారా చేస్తున్న అనేక సేవా కార్యక్రమాలతో నిరుపేద ప్రజలకు ఎంతో లబ్ధి చేకూరుతుందని, తపన ఫౌండేషన్ వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలవరం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పారేపల్లి రామారావు, తపన ఫౌండేషన్ ఇన్‌చార్జి గణేష్, మాజీ జెడ్పిటిసి సభ్యురాలు ఎస్ఆర్ఆర్ పి. సుభద్ర దేవి, మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు బొల్లిన నిర్మల కిషోర్, మద్దు బాల నాగేశ్వరరావు, గొలిశెట్టి వాసు, మద్దు తేజ, బాలం సురేష్, కటిక రాధాకృష్ణ, చిటికెన రమేష్, తాడి సాయిబాబు భోగరాజు రమేష్, సుంకర ప్రసాద్, బొమ్మ మోహన్, కోన రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

విశాలాంధ్ర -భీమవరం: పెదగరువు విద్యుత్ ఉపకేంద్రం పరిధిలోని శ్రీరామపురం, పెదగరువు ఫీడర్లకు సంబంధించి మరమ్మతులు, చెట్లు కొమ్మలు తొలగించు నిమిత్తం మంగళవారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు పెదగరువు, రాజుల గరువు, వెంప, శ్రీరామపురం, శివన్నారాయణపురం గ్రామాలతో పాటు ఆక్వా, చేపల చెరువుల లైన్లకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ ఈఈ ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు.

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర - ఏలూరు: కుక్కునూరు మండలంలోని గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ ఏలూరు జిల్లా నాయకులు కొన్నె లక్ష్మయ్య, సీపీఐ కుక్కునూరు సహాయ కార్యదర్శి కురకుల బాబూరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సీపీఐ కార్యాలయంలో ఏఐటీయూసీ అనుబంధ సంఘం గ్రామ పంచాయతీ కార్మికులతో సమావేశమై ఆయన మాట్లాడారు. ఏళ్ల నుంచి పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వాలు విఫలమవు తున్నాయని పేర్కొన్నారు. వెట్టిచాకిరి చేయించుకుంటూ కార్మికుల బాగోగులను పట్టించుకోకుండా ప్రభుత్వం గాలికి వదిలేసిందని విమర్శించారు. పంచాయతీ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేసి ట్రెజరీ ద్వారా నేరుగా వేతనాలు చెల్లించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. నెల మొదటి వారంలోనే కార్మికుల వేతనాలు చెల్లించాలని స్పష్టం చేశారు. అర్హులైన కార్మికులకు గుర్తింపు

కార్డులు,ప్రతి ఏటా యూనిఫామ్ ఇవ్వాలని ఆయన పేర్కొన్నారు. అనంతరం కుక్కునూరు మండల కమిటీని ఏర్పాటు చేశారు. కన్వీనర్‌గా నకిరికంటి సంతోష్, కమిటీ సభ్యులుగా కురకుల ఆనందరావు, కుండా శేషగిరి,అవులూరి వెంగలరావు, మాచర్ల శ్రీను, రాజేష్,కృష్ణార్జున్ రావు,గాడిద కృష్ణ, వేల్పుల తిరుపతమ్మలను ఎన్నుకున్నారు.

సామాజిక సేవే లయన్స్ క్లబ్ లక్ష్యం

శాసనమండలి సభ్యులు వంక రవీంద్రనాథ్

విశాలాంధ్ర -భీమవరం: వ్యక్తిత్వ పరిణితి, పరిపక్వత లయన్స్ లీడర్ షిప్ ద్వారా పొందవచ్చని శాసన మండలి సభ్యులు, లయన్స్ పూర్వ కౌన్సిల్ చైర్మన్ వంక రవీంద్ర నాథ్ అన్నారు. సోమవారం వీరవాసరం గ్రామంలో నూతనంగా స్థాపించిన

లయన్స్ క్లబ్ ఆఫ్ వీరవాసరం, నూతన కార్యవర్గ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని రవీంద్రనాథ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పెట్టిన నూతన క్లబ్ సభ్యులకు అభినందనలు తెలియచేస్తూ, సామాజిక సేవ అవశ్యకాన్ని తెలియజేశారు. ప్రతి పౌరుడు, పొరుగు వారి కోసం కొంత దానం చేయాలని రవీంద్ర నాథ్ అన్నారు. తణుకు మున్సిపల్ మాజీ చైర్మన్, లయన్స్ డిస్ట్రిక్ట్ గ్లోబల్ సర్వీస్ కోఆర్డినేటర్ వంక రాజకుమారి మాట్లాడుతూ సేవాసంఘాలలో మహిళలు ఎక్కువగా భాగస్వాములు కావాలని,వారి పాత్ర మహిళా మెడికల్ క్యాంపులలో ఆవశ్యకత ఉంటుందని తెలిపారు. సభలోని ముగ్గురు మహిళా సభ్యులు సభ్యత్వాన్ని తీసుకోవడానికి ముందుకు వచ్చారు. నూతన అధ్యక్షులు పోలిశెట్టి సత్యనారాయణ (దాసు) మాట్లాడుతూ నూతన క్లబ్‌ను సుస్థిర పరచి సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. డి. పుల్లారావు కార్యదర్శిగా, జి. సత్యనారాయణ కోశాధి కారిగా, మరో ఏడుగురు సభ్యులు ఇతర హోదాలలో ప్రమాణం చేశారు. జిల్లా గవర్నర్ పాపారావు నాయుడు సమక్షంలో, మల్టిపుల్ చైర్మన్ మేక శ్రీరామ్ సురేష్ ,పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ బాబ్జీ, సెకండ్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఆర్ వి ఎస్ రాజు తదితరులు పాల్గొన్నారు.

తల్లి పాల వారోత్సవాలపై అవగాహన

విశాలాంధ్ర-పాలకోడేరు : తల్లి పాల వారోత్సవాలలో భాగంగా సోమవారం పాలకోడేరు అంగన్వాడీ కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు పార్వతి, సూర్యకుమారి పాల్గొని తల్లి పాలు ఇవ్వడం వల్ల బిడ్డకు వ్యాధినిరోధక శక్తి

పెరుగుతుందని తెలిపారు. తల్లికి రొమ్ము క్యాన్సర్ రాకుండా ఉంటుందని, కాన్పుకు కాన్పుకు మధ్య ఎడం ఉండాలని అవగాహన కల్పించారు. పుట్టిన బిడ్డకు ఆరు నెలలు వచ్చేవరకు కచ్చితంగా తల్లిపాలు ఇవ్వాలని ఏమాత్రం డబ్బా పాలు ఇవ్వరాదన్నారు. అనంతరం తల్లులతో కలిసి ర్యాలీ నిర్వహించి స్థానిక ఎంపీడీవో కార్యాలయం నందు మండల అధికారులతో తల్లిపాల వారోత్సవాలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, అంగన్వాడి టీచర్లు విమల, రమణ, శాంతకుమారి, జ్యోతి, అనంతలక్ష్మి, తల్లులు పాల్గొన్నారు.

హెల్మెట్ ప్రాణాన్ని రక్షించింది

సురక్షితంగా బయటపడ్డ వాహనచోదకుడు

విశాలాంధ్ర- ఉంగుటూరు : ఉంగుటూరు మండలం బాదంపూడి బైపాస్ వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి గాయపడ్డారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. అమలాపురం ఆర్టీసీ డిపోకు చెందిన ఎక్స్‌ప్రెస్ విజయవాడ నుండి అమలాపురం వెళుతుండగా విజయవాడ వెళుతున్న ద్విచక్ర వాహనదారుడు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదంలో తాడేపల్లిగూడెంకు చెందిన గెద్దాపు రాజశేఖర్ కు తీవ్ర గాయాలయ్యాయి. అతనిని హైవే అంబులెన్స్ లో తాడేపల్లిగూడెం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ద్విచక్ర వాహన దారుడు రాజశేఖర్ హెల్మెట్ ధరించడంతో గాయాలతో సురక్షితంగా బయటపడ్డారు. గాయపడిన రాజశేఖర్ రెడ్డితో ఆయన కుటుంబ సభ్యులకు ఫోన్ చేయటంతో అతనిది తాడేపల్లిగూడెం పట్టణమని తెలిసింది.బస్సులో సుమారు 30 మంది ప్రయాణికులు ఉన్నారు. బస్సును మోటార్ సైకిల్ ఢీకొనడంతో వచ్చిన శబ్దంతో ప్రయాణికులు ఆందోళన చెందారు. మనిషి గాయాలతో ఉండటంతో వారు ఊపిరి పీల్చుకున్నారు. ఆర్టీసీ బస్సు డ్రైవర్ వివరాలను పోలీసులు నమోదు చేసి ఆ బస్సును గమ్యస్థానం పంపించారు. చేబ్రోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యుత్ స్టేషన్ వద్ద ధర్నా జయప్రదం చేయండి

విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం: ప్రభుత్వం బిగిస్తున్న స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ మంగళవారం విద్యుత్ స్టేషన్ వద్ద జరిగే ధర్నా జయప్రదం చేయాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు కలిశెట్టి వెంకటరావు, తాడేపల్లిగూడెం పట్టణ కార్యదర్శి మండల నాగేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. విద్యుత్ స్మార్ట్ మీటర్స్ కూటమి ప్రభుత్వం ప్రజల పై రుద్దు తోందని,స్మార్ట్ మీటర్ పేరుతో ప్రజలపై వేల కోట్ల రూపాయలు విద్యుత్ భారాన్ని మోపుతుందన్నారు. సెల్ ఫోన్ ముందుగా రీఛార్జ్ చేసుకున్నట్టు ముందుగానే ఇంటి కరెంట్ కు డబ్బులు చెల్లించి రీఛార్జ్ చేసుకోవాల్సి వస్తుందన్నారు. ముందుగా రీఛార్జ్ చేయకపోతే ఇంట్లో కరెంటు ఉండదన్నారు. అదనపు ఛార్జీలతో కరెంటు బిల్లు చాలా ఎక్కువగా వస్తుందని అన్నారు. అదాని కంపెనీకి చెందిన స్మార్ట్ మీటర్స్ ఒక్కొక్క మీటర్ కు రూ.9 వేల నుండి 19 వేలు వరకు ప్రజలు వద్ద నుండే వసూలు చేస్తారన్నారు. ఆనాటి ప్రతి పక్షం లో వున్న వారు గత ప్రభుత్వం స్మార్ట్ మీటర్స్ పెడితే పగల కొట్టమని చెప్పిన వారు అధికారం లోకి వచ్చిన తరువాత బిగించ మనడం సరి కాదని విమర్శించారు. స్మార్ట్ మీటర్లు బిగించడానికి వస్తే ప్రజలు అంతాఏకమై వాటిని వ్యతిరేకించాలని అన్నారు.నేడు ధర్నా లో పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

గిరిజన మహిళల జీవనోపాధికి ఊతం

త్వరలో వెదురు కర్రలతో బొమ్మలు తయారు చేయడంపై శిక్షణ

విశాలాంధ్ర-ఏలూరు: గిరిజన స్వయం సహాయక సంఘ మహిళలకు జీవనోపాధులు మెరుగుపర్చేందుకు త్వరలో శిక్షణా కార్యక్రమం నిర్వహించదలచినట్లు కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో కొంతమంది గిరిజన మహిళలు వెదురు కర్రలతో తయారు చేసిన ఉత్పత్తులను జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి,జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి పరిశీలించారు.

బుట్టాయి గూడెం మండలం పులిరామన్న గూడెం, కోట రామచంద్రాపురం గ్రామాల్లో వున్న వెదురు కర్రలతో బొమ్మలు తయారు చేసే హస్త కళాకారులకు పులి రామన్న గూడెంలో శిక్షణ పారంభించదలచినట్లు తెలిపారు.ఈ విషయంపై సంబంధిత గిరిజన మహిళలతో జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ వారు మాట్లాడారు. వెదురు ఉత్పత్తులను తయారుచేసే గిరిజన మహిళలకు 45 రోజులపాటు శిక్షణ అందించి అవసరమైన రుణాలు అందించనున్నట్లు తెలిపారు. వీరు తయారుచేసిన వస్తువులను ఆన్ లైన్ ద్వారా అమ్ముకునే విధంగా ఓఎన్ డిసి ఆన్ లైన్ మార్కెట్ సౌకర్యానికి అనుసంధానం చేయబడుతుంది. ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ పిడి ఆర్.విజయరాజు తదితరులు ఉన్నారు.

శ్రీవారి నిత్యాన్న పథకానికి రూ. 1 లక్ష విరాళం

విశాలాంధ్ర-ద్వారకా తిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రం ద్వారకాతిరుమల శ్రీవారి నిత్య అన్నదాన పథకానికి రూ. 1లక్ష విరాళం సమకూరింది. విజయవాడకు చెందిన మాలంపాటి రామకృష్ణయ్య ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో సోమవారం జమ చేశారు. ఈ

సందర్భంగా ఆలయ ఏఈఓ నటరాజారావు దాతను ప్రత్యేకంగా అభినందించి స్వామి వారి ప్రసాదాలను, నిత్య అన్నదాన పత్రాన్ని అందజేశారు.

పోలవరం ఎమ్మెల్యే అవినీతిపై స్వతంత్ర దర్యాప్తు సంస్థతో విచారణ జరిపించాలి

సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య

విశాలాంధ్ర- ఏలూరు: పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అవినీతిపై ఆడియో సంభాషణ, ఆరోపణలపై స్వతంత్ర దర్యాప్తు సంస్థతో విచారణ జరిపించి నిజా నిజాలు నిగ్గు తేల్చాలని, సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పోలవరం ఎమ్మెల్యే అవినీతి వ్యవహారంపై ఇటీవల సోషల్ మీడియాలో వివాదాస్పద ఆడియో చెక్కర్లు కొట్టిన విషయం అందరికీ విదితమే. ఏడాదిలోనే రూ.100 కోట్లు సంపాదించాడని కూటమిలోని కీలక నేతలే మాట్లాడిన ఆడియో అటు జనసేన పార్టీతో పాటు జిల్లాలోనూ విస్తృత చర్చకు దారి తీసిందన్నారు. గతంలో ఇసుక, మట్టి, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ, ముడుపుల బాగోతంలో ఎమ్మెల్యే పై అనేక ఆరోపణలు వచ్చాయని వీటిని ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టారని, వీటన్నింటిపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలు వెలికి తీయాలని కృష్ణ చైతన్య డిమాండ్ చేశారు.

పారిశుద్ధ్య పనులపై శ్రద్ధ వహించాలి

విశాలాంధ్ర–లింగపాలెం: పారిశుద్ధ్య పనులలో నిర్లక్ష్యం వహించే పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందిపై చర్యలు ఉంటాయని డిప్యూటీ ఎంపీడీవో సుందరి హెచ్చరించారు. పంచాయతీలలో జరిగే పారిశుద్ధ్య పనులపై లింగపాలెం మండల పరిషత్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఈమె పలు సూచనలు చేశారు. పలువురు పంచాయతీ కార్యదర్శుల పనితీరుపై

అసహనం వ్యక్తం చేశారు. వీరి పని తీరు మారకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రధానంగా మేజర్ పంచాయతీ ధర్మాజీగూడెంపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నట్లు ఈమె తెలిపారు. ఈ పంచాయతీపై ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని ఈమె పేర్కొన్నారు. ప్రతి పంచాయతీలో తడి,పొడి చెత్తను డంపింగ్ యార్డులకు తరలించాలని చెత్తను తొలగించడంలో నిర్లక్ష్యం వహించవద్దని సూచించారు. పంచాయతీలలో పారిశుద్ధ్య పనులపై కలెక్టర్ వెట్రి సెల్వి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని కార్యదర్శులు కలెక్టర్ ఆదేశాలను పరిగణలోకి తీసుకోవాలని తెలిపారు. గ్రామాలలో దోమలు బెడదా అధికంగా ఉందని వీటి నివారణకు కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో తమ వంతు శ్రద్ధ చూపాలని కోరారు.

గృహిణికి న్యాయం చేయాలని నిరసన

విశాలాంధ్ర -భీమవరం: పెనుగొండ గ్రామానికి చెందిన పడాల మీనాక్షి అనే గృహిణికి భర్త ముసలయ్య నుంచి రక్షణ కల్పించి న్యాయం చేయాలని దళిత ఐక్య వేదిక ఆధ్వ ర్యంలో సోమ వారం కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. దళిత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందర్ కుమార్ మాట్లాడుతూ ముసలయ్య, మీనాక్షి లకు పెళ్లి అయి 23 ఏళ్లు



అయ్యిందని, గత 9 ఏళ్లుగా మీనాక్షిని వదిలేసి మానసికంగా వేధిస్తున్నారని, దీనిపై పెనుగొండ పోలీసు స్టేషన్ లో ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని వాపోయారు. దీనిపై ఇన్ ఛార్జ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డికి వినతిపత్రాన్ని అందించామని, ముసలయ్య నుంచి గృహిణికి రక్షణ కల్పించాలని ఆ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఇంటర్నేషనల్ హ్యూమన్స్ రైట్స్ స్టేట్ జనరల్ సెక్రటరీ మహ్మద్ సలీమా, మాల మహానాడు జాతీయ కన్వీనర్ చీకటిపల్లి మంగరాజు, ఇంటర్నేషనల్ హ్యూమన్స్ రైట్స్ జిల్లా ప్రెసిడెంట్ యల్లబిల్లి ఝాన్సీ కొండేటి లాజర్, పి.వేణు, పట్టెం.శుభాకర్, కటిక తాతారావు తదితరులు పాల్గొన్నారు.

మత జాతీయవాదం రాజ్యాంగ విరుద్ధం

ప్రముఖ చరిత్రకారులు
కొప్పర్తి వెంకటరమణమూర్తి

విశాలాంధ్ర-తణుకు : మెజారిటీ మత జాతీయవాదం రాజ్యాంగ విలువలకు విరుద్ధమైనదని ప్రముఖ చరిత్రకారులు కొప్పర్తి వెంకటరమణ మూర్తి అన్నారు. స్థానిక రోటరీ క్లబ్ ఆడిటోరియంలో రాజ్యాంగ ప్రచార వేదిక ఆధ్వర్యంలో జరిగిన సభలో ఆయన మాట్లాడారు. ప్రచార వేదిక కన్వీనర్ డి వి వి యస్ వర్మ అధ్యక్షతన జరిగిన ఈ సభలో ముఖ్య అతిథిగా కొప్పర్తి పాల్గొని " సాంస్కృతిక జాతీయవాదం - రాజ్యాంగ విలువలు " అన్న అంశం పై ప్రసంగిస్తూ దేశంలో నివసించే ప్రజలందరికీ చెందిన భారత ప్రాదేశిక జాతీయవాదానికి , మెజారిటీ మతానికి మాత్రమే పరిమితమైన జాతీయ వాదాల మధ్య సంఘర్షణ జరుగుతున్నదని అన్నారు. ఈ మత జాతీయవాదం రాజ్యాంగ విలువలకు విరుద్ధమైన దని అన్నారు. భారత రాజ్యాంగం కుల,మత , ప్రాంతాలకు అతీతంగా అందరికీ సమానంగా ప్రజాస్వామ్య హక్కులను కల్పించిందని ,దేశ ప్రజలు ఒక జాతిగా రూపొందడానికి ప్రాతిపదికను ఇచ్చిందని తెలిపారు. మెజారిటీ మత జాతీయవాదం కేవలం అధికారం కోసం ప్రజలను విభజించి చేసే విద్వేష రాజకీయం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు అవుతుంద న్నారు. 'చరిత్ర- జాతీయత- సాంస్కృతిక ఆధిక్యం' అంశాలపై " సంభాషణ" పేరుతో ప్రచురించిన తన పుస్తకాన్ని 'ఎప్పుడు ఎడతెగక పారు ఏరు' డివివియస్ వర్మకు అంకితం ఇచ్చానని పేర్కొన్నారు. తాను వివిధ అంశాలపై తీసుకున్న మలుపులకు ఆయనే మార్గదర్శిగా వున్నారని ఆ పుస్తకం కాపీని అందించారు. తెలుగు స్టడీ సర్కిల్ తరపున డాక్టర్ రమేష్ చంద్రబాబు స్వాగతం పలుకగా చివరిగా సామాజిక న్యాయపోరాట సమితి వ్యవస్థాపకులు పేరూరి మురళీ కుమార్ "సంభాషణ" పుస్తకాన్ని పరిచయం చేశారు. ముస్లిం జెఏసి నాయకులు నూర్ అహమ్మద్ రెహ్మాన్, వివిధ రంగాలకు చెందిన పురప్రముఖులు ఆకుల వెంకటేశ్వరరావు,డాక్టర్ వి. వెంకటరాజు, డాక్టర్ హుస్సేన్ అహ్మద్, సంకు మనోరమ, చల్లా హైమావతి, బి. ఝాన్సీ, కోనాల భీమారావు, పి. దక్షిణామూర్తి, కరుణాకర చౌదరి, కొసరాజు, మల్లిని రాజేంద్ర ప్రసాద్, సంపత్ కుమార్, నీలం మాల్యాద్రి, గొల్లపల్లి అంబేద్కర్, కౌరు వెంకటేశ్వర్లు, వడ్డి సుబ్బారావు,కె వి ఆంజనేయులు, టి అప్పలస్వామి, మండలపర్తి హరీష్ , ఏడుకొండలు, విష్ణువర్ధన్, పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

5 వరకు హర్ ఘర్ తిరంగా క్యాంపెయిన్

కలెక్టర్ కె. వెట్రిసెల్వి

విశాలాంధ్ర-ఏలూరు: జిల్లాలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని ఈనెల 15వ తేదీ వరకు పెద్దఎత్తున చేపట్టి ప్రజల్లో స్వాతంత్ర్య ఉద్యమంపట్ల అవగాహన, దేశభక్తిభావం పెంపొందించాలని కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారు లను ఆదేశిం చారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ గోదావరి సమావేశ మంది రంలో హర్ ఘర్ తిరంగా క్యాంపెయిన్ -2025 నిర్వహణ ఏర్పాట్లపై సంబంధిత అధికారులకు కలెక్టర్ వెట్రిసెల్వి దిశా,నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా హర్‌ఘర్ తిరంగా కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా తిరంగా ర్యాలీలు,రంగోలీ పోటీలు, దేశభక్తిని పెంపొందించే ఫొటో ఎగ్జిబిషన్లు, సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రతి కార్యాలయం, ఇంటిపై జాతీయజెండా ఎగురవేయుట వంటి తదితర కార్యక్రమాలు నిర్వహించవలసి వుంటుందన్నారు. జిల్లా వ్యాప్తంగా నిర్వహించే కార్యక్రమాలు విజయవంతంగా జరిగేందుకు జెడ్పీ సిఇఓ, డీఆర్డీఏ పిడి, ఐసిడిఎస్ పిడి, సెట్ వెల్ సిఇఓ, డిఇఓ, ఆర్ఐఓ, తదితర అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి వి. విశ్వేశ్వరరావు, జడ్పీ సీఈవో యం.శ్రీహరి,డీఆర్డీఏ పీడీ ఆర్.విజయరాజు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ యం.ముక్కంటి, డిఇఓ ఎం.వెంకట లక్ష్మమ్మ, ఆర్ఐఓ యోహాన్, ఐసిడిఎస్ పిడి పి.శారద, ఎపిఇపిడిసిఎల్ ఎస్ఈ పి. సాల్మన్ రాజుతోపాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పీ4 ఇతర రాష్ట్రాలకు ఆదర్శం

విశాలాంధ్ర-ఆగిరిపల్లి: రాష్ట్రంలో పేదరికం లేని సమాజ స్థాపనకు సీఎం చంద్రబాబునాయుడు సంకల్పానికి మార్గదర్శి లుగా తాము పూర్తిగా సహకరిస్తా మని నితిన్ కృష్ణ కన్‌స్ట్రక్షన్స్ అధినేత కొలుసు నితిన్ కృష్ణ చెప్పారు. ఆగిరిపల్లిలో సోమవారం విస్తృతంగా తిరిగి తాను దత్తత తీసుకున్న కుటుంబాలను కలుసుకుని ఆర్థికాభివృద్ధికి వారు కోరుకున్న సుమారు రూ.10లక్షల విలువైన పాడి పశువులు, తోపుడు బళ్ళు, సైకిల్, కుట్టు మిషన్లను అందజేశారు. ఈ సందర్భంగా నితిన్ కృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో పేదరిక నిర్మూలనకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు పీ4 కార్యక్రమాన్ని నూజివీడు నియోజకవర్గం ఆగిరిపల్లిలో లాంఛనంగా ప్రారంభించారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఫేజ్-1 గా మొదటి విడతలో 10 కుటుంబాలను ఇంటింటికి స్వయంగా వెళ్ళి వారు కోరుకున్న రూ.10 లక్షలతో ఉపకరణాలు అందించినట్టు తెలిపారు. నేటి బంగారుకుటుంబాలే రేపటి మార్గదర్శులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో తాను పనిచేస్తున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్తు సిఇవో, నియోజక వర్గ ప్రత్యేక అధికారి యం.శ్రీహరి, తహశీల్దారు పి.యన్.వి.ప్రసాదు, యంపిడివో బి.భార్గవి, మండల వివిధ శాఖలు అధికారులు, వివిధ గ్రామాలు సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

బిఎల్ సర్టిఫికెట్లు ప్రదానం

విశాలాంధ్ర -భీమవరం : డి.ఎన్.ఆర్ లా కళాశాల విద్యార్థులకు మూడేళ్ల బిఎల్ సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల సెక్రె టరీ అండ్ కరెస్పాండెంట్ బాబు, ఉపాధ్యక్షులు గోకరాజు పాండురంగరాజు, ఎ.ఓ., పి. రామకృష్ణ రాజు, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రఘురాం, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వై. అశోక్ కుమార్, చెల్లబోయిన రంగారావు, సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ భవనం వద్ద ధర్నా

ప్రజా సంఘాల ఐక్య
కార్యాచరణ వేదిక

విశాలాంధ్ర-ఏలూరు: ప్రమాదకరమైన స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని కోరుతూ మంగళవారం జిల్లా విద్యుత్ భవనం వద్ద జరిగే ధర్నా జయప్రదం చేయాలని ప్రజాసంఘాల ఐక్య కార్యాచరణ వేదిక పిలుపునిచ్చింది. సోమవారం నగరంలోని వివి నగర్ మార్కెట్ యార్డ్ ఏరియాలో స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని, పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని కోరుతూ ప్రజాసంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్ర మాన్ని ఉద్దేశించి ఏఐటియుసి ఏలూరు జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్ డాంగే, ఇఫ్టియు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు,సిఐటియు జిల్లా నాయకులు పంపన రవికుమార్, సిపిఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ మోడీ సర్కార్ భారతదేశంలో నూతన విద్యుత్ సంస్కరణల చట్టం తీసుకు వచ్చిన తర్వాత, ముందుగా రైతాంగం మీద పెను భారం వేస్తూ, వ్యవసాయ పంపుసెట్లకు మోటర్లు మీటర్లు బిగిస్తూ ప్రజల నుండి ఆర్థిక దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. బిజెపి సర్కారు విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించవలసిన సమయం ఆసన్న మైందన్నారు. ఎన్నికలకు ముందు చేసిన వాగ్దానాలను విస్మరించి,మోడీ,బాబు ప్రభుత్వ విధానాలు ఉన్నాయన్నారు. పాలకుల విధానాలకు వ్యతిరేకంగా నేడు జిల్లా విద్యుత్ కేంద్రం వద్ద జరిగే ధర్నా కార్యక్రమానికి అధిక సంఖ్యలో ప్రజలు

పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఈ సంతకాల సేకరణ కార్యక్ర మంలో ఏఐటియుసి ఏలూరు జిల్లా కోశాధి కారి పుప్పాల కన్నబాబు, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య నగర కార్యదర్శి అడ్డగర్ల లక్ష్మి ఇందిరా, ఉప్పులూరి లక్ష్మి,య. భవాని, ఇఫ్టియు. నగర ప్రధాన కార్యదర్శి యర్రా శ్రీనివాస రావు, మీసాల రమణ, కోరాడ అప్పారావు, ధనను విజయ్, పద్మ సింహాచలం, సూరిబాబు, నాయుడు, భాస్కర్, సీమమ్మ, సరోజిని, రాములమ్మ, దుర్గారావు, ఇఫ్టూ జిల్లా నాయకురాలు అరుణకుమారి, సిఐటియు నాయకులు ఎం.ఇస్సాకు, ఎస్. సత్యనారాయణ,రైతు సంఘం నాయకులు జి. కోటేశ్వరరావు, సూరి బాబు, దానియేలు, త్రినాథ్, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు ఆరోగ్య కవచం

విశాలాంధ్ర -ముదినేపల్లి : తల్లిపాలు బిడ్డకు ఆరోగ్య కవచంగా ఉంటుందని అంగన్ వాడీ సూపర్వైజర్ బి.సుందరమ్మ అన్నారు. తల్లిపాల వారోత్సవాలు ముదినేపల్లి మండలం అల్లూరు-2 అంగన్‌వాడీలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు హక్కు అన్నారు. బిడ్డ భవిష్యత్తులో ఆరోగ్యవంతంగా ఎదిగేందుకు వ్యాధి నిరోధక శక్తివంతంగా ఉంటుందన్నారు. బిడ్డకు పాలు ఇవ్వడంతో తల్లికి శారీరకంగా, మానసికంగా రక్షణ లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎడ్యుకేటర్ సిహెచ్ భాగ్యలక్ష్మి, నాంచారమ్మ, ఏఎన్ఎం బి.కృప సంతోషిబాయి, ఎంఎల్‌హెచ్ వి. సహేమాబేగం , ఆశాలు స్వాతి, సీతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డాక్యుమెంట్ ప్రకారం
ఆక్రమణలు తొలగించాలి

విశాలాంధ్ర - పాలకోడేరు : పాలకోడేరు మండలం శృంగవృక్షం గ్రామంలో ఆక్రమణలు తొలగించడం పట్ల గ్రామాభివృద్ధి కమిటీ హర్షం వ్యక్తం చేసింది. ఆదివారం ఉండి ఎమ్మెల్యే రఘురామ కృష్ణంరాజు పర్యటనలో భాగంగా ఆక్రమణలు తొలగించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేయడంతో సోమవారం నుండి అధికారులు ఆక్రమణలు తొలగిస్తు న్నారు. దీనికి సంబంధించి గ్రామ అభివృద్ధి కమిటీ హర్షం వ్యక్తం చేయడమే కాకుండా ప్రభుత్వ రికార్డుల ప్రకారం రోడ్డును సర్వే చేసి కొలతలు వేసి ఆక్రమణలు స్వచ్ఛందంగా తొలగించుకునే అవకాశం ఇవ్వాలని, లేకపోతే ప్రభుత్వమే తొలగించాలని కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు గులిపల్లి సత్యనారాయణ, సోము రామకృష్ణ సూచించారు . ఆ పై డ్రైనేజ్ లు నిర్మించి సిమెంట్ రోడ్ వేయాలని ఎంఎల్ఏ రఘురామ కృష్ణం రాజును కోరారు. లేకపోతే ఆక్రమణలు పునరావృతం అవుతాయని, శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

హాస్టల్ విద్యార్థులకు వైద్య పరీక్షలు

విశాలాంధ్ర - గణపవరం: గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సచివాలయం-2 పరిధిలోని ఎస్సీ బాలుర హాస్టల్‌ను డాక్టర్ పి. కిరణ్మయి ఆధ్వర్యంలో సోమవారం పిల్లలకు సాధారణ ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. వసతి గృహంలో 45 మంది పిల్లలు ఉండగా హాజరైన వారు 37 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు ఇచ్చినట్లు వైద్యాధికారి తెలిపారు. ప్రతి నెల మొదటి శనివారం పరీక్షలు చేస్తామని వార్డెన్‌కు తెలియజేశారు. అన్ని రూములు, వంటగది చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ ప్రతి రోజు ఉదయం, సాయంత్రం గోరువెచ్చటి నీటితో స్నానం చేయాలని, ఉతికిన దుస్తులు ధరించాలని, ఎవరి టవల్స్ వారే వాడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి కమ్యూనిటీ హెల్త్ అధికారి జాలాది విల్సన్ బాబు పిల్లలకు ఆరోగ్య విద్య ద్వారా వివరించారు. ఎం ఎల్ హెచ్ పి నున్న పాప, ఏపిఎంలు ఐ. జయమ్మ, ఎం ఎం వి లక్ష్మి, ఆశా నాగమణి తదితరులు పాల్గొన్నారు.

TADEPALLIGUDEM MUNICIPALITY

E-PROCUREMENT TENDER NOTICE

Roc.No.2422/E1/2023-24 Dated : 04-08-2025

Sl No.	Name of the Work	Name of the Grant	Estimate Value (Rs in Lakhs)	Bid Downloading Start Date	Last Date for Receipt of Bids
1.	Plantation of Plants, Bore well, Removing Debris, Arrangements Gov, Programs, CC Drain Culvert, Distribution Lines, Safety Nets, Repairs, BT Potholes-14 works-14	General Funds	43.89	05-08-2025	19-08-2025

Full details can be had from the Municipal Engineering Department during working hours or visit Web site https://tender.apeprocurement.gov.in.

Sd/- Commissioner,
Tadepalligudem Municipality

జాతీయస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు అర్జున్, ప్రణీత్ ఎంపిక

విశాలాంధ్ర - కడియం : మండల కేంద్రమైన కడియం గ్రామానికి చెందిన దాసరి నాగ వెంకట అర్జున్, రాజమహేంద్రవరానికి చెందిన ఎం ప్రణీత్‌లు అండర్ 14 డబుల్స్ బాడ్మింటన్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు కోచ్ నాగులకొండ వీరభద్రం తెలిపారు. ఇటీవల సికింద్రాబాద్ స్కూల్ గేమ్స్ ఐసిఎస్ఇ ఆంధ్రా తెలంగాణా రీజనల్ బాడ్మింటన్ డబుల్స్‌లో అర్జున్, ప్రణీత్‌లు మొదటి స్థానంలో నిలిచారని ఆయన తెలిపారు. తమిళనాడులో సెప్టెంబర్ 24, 25 తేదీలలో జరిగే జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ పోటీలలో అర్జున్, ప్రణీత్ లు పాల్గొననున్నట్లు ఆయన తెలిపారు. అర్జున్ తాతయ్య నానమ్మ దాసరి నాగభూషణం సత్య కుమారిలు, అదేవిధంగా ప్రణీత్ తల్లిదండ్రులు ఎం దీప, చలపతిలు అర్జున్ ప్రణీత్‌లకు అభినందనలు తెలిపారు.

బెల్టు షాపుల బెడద

విశాలాంధ్ర - సీతానగరం: జాతిపిత మహాత్మా గాంధీ నడయాడిన కస్తూర్బా గాంధీ ఆశ్రమానికి తప్పని బెల్టు షాపుల బెడద. మండలంలో సీతానగరం గ్రామంలో సోమ వారం ఎంపిడిఓ ఎమ్ భారతి జరిగిన పీ జీ ఆర్ ఎస్ వేదికలో వివిధ సమస్యలపై నాలుగు అర్జీలు వచ్చాయి. వీటిలో ప్రధానంగా దశాబ్దాల ఘన చరిత్ర కలిగిన శ్రీ కస్తూర్బా గాంధీ ఆశ్రమం గోడను అనుకొని బెల్ట్ షాపులు ఉన్నాయని వీటివల్ల ఆశ్రమం గోడపై తాగుబోతులు కూర్చుని ఆశ్రమ వాసులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు అని, అలాగే గోడకు అనుకొని వివిధ వ్యాపారాలు కొనసాగిస్తున్నారు అని వాటిని వెంటనే తొలగించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని ఆశ్రమ నిర్వాహకురాలు సుశీల అర్జీ సమర్పించారు. అలాగే వివిధ గ్రామాల నుంచి భూ సంబంధిత అర్జీలు వచ్చాయని అన్నారు. ఈ అర్జీలను సంబంధిత శాఖ అధికా రులు బదిలీ చేయడం జరిగింది అని అన్నారు. ఈ కార్యక్రమంలో అనేక శాఖల మండల అధికారులు పాల్గొన్నారు.

మహిళలకు చట్టాలపై అవగాహన

విశాలాంధ్ర - సీతానగరం: నేటి సమాజంలో మహిళలకు చట్టాల పై అవగాహన ఉండాలని ఎస్సై డి రామ్ కుమార్ అన్నారు. సోమవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శక్తి టీమ్ ఏ ఎస్ ఐ వీరాజు ఆధ్వర్యంలో ఎంపిడిఓ ఎమ్ భారతి, ఎస్సై డి రామ్ కుమార్ ముఖ్య అతిథులుగా మహిళలకు చట్టాల పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్సై డి రామ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళల ప్రత్యేక రక్షణ కొరకు రూపొందించిన మొబైల్ యాప్ శక్తి యాప్ అని అన్నారు. ఈ శక్తి యాప్ యొక్క ప్రాధాన్యత, వినియోగం గురించి వివరించారు. నేటి సమాజంలో మహిళలపై జరిగే లైంగిక వేధిం పులు, పిల్లల మీద జరిగే లైంగిక వేధింపులు, గుడ్ అండ్ బ్యాడ్ టచ్ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. అలాగే ముఖ్యంగా యువత మాదకద్రవ్యాల వాడకం వల్ల ఎదుర్కొం టున్న సమస్యలు వాటి వల్ల కలిగే అనర్థాల గురించి వివరించారు. ప్రస్తుతం మరో ప్రధాన సమస్య అయినా సోషల్ మీడియా దుర్వినియోగం ద్వారా మహిళలపై జరిగే సైబర్ నేరాలు, వాటిని ఎలా ఎదుర్కోవాలి అనే వాటి పై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ ఎస్ఐ బి సురేష్, శక్తి టీమ్ విశ్వనాథ రెడ్డి, శ్రీనివాస్, దుర్గాభవాని, ఏ ఓ సుబ్రమణ్యం, మహిళలు పాల్గొన్నారు.

నులిపురుగుల నిర్మూలనే లక్ష్యం : కలెక్టర్

విశాలాంధ్ర - తూర్పుగోదావరి : పిల్లలు, కిశోర బాలలలో నులి పురుగుల నిర్మూలనే లక్ష్యంగా ఈ నెల 12న జిల్లావ్యాప్తంగా జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి తెలిపారు. సోమవారం ఉదయం బొమ్మూరు కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ సమావేశ మందిరంలో ఆల్బెండజోల్ ప్రచార గోడపత్రికను జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్న రాముడుతో కలిసి ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి మాట్లాడుతూ, నులి పురుగులు సోకిన పిల్లల్లో రక్తహీనత, పోషకాహార లోపం, ఆకలి తగ్గడం, నిదానమైన శారీరక వృద్ధి, కడుపునొప్పి, వికారం, వాంతులు, విరోచనాలు, బరువు తగ్గడం వంటి అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని పేర్కొన్నారు. ఈ సమస్యల నివారణకు ప్రతి సంవత్సరం రెండు దఫాలుగా దేశవ్యాప్తంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సంవత్సరం ఆగస్టు 12న జిల్లా వ్యాప్తంగా మొదటి విడతగా ఈ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. 1-5 ఏళ్ల పిల్లలకు అంగన్వాడీ కేంద్రాల్లో, 6-19 ఏళ్ల పిల్లలకు పాఠశాలలు, కళాశాలలలో ఉచితంగా ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చెయ్యడం జరుగుతుందని వెల్లడించారు. పాఠశాలకు వెళ్లని లేదా ఇతర పిల్లలకు కూడా అంగన్వాడీ కేంద్రాల ద్వారా మాత్రలు అందుబాటు లో ఉంచనున్నట్లు పేర్కొన్నారు. మాత్రల మోతాదులు: 1-5 ఏళ్ల పిల్లలకు -200 మి.గ్రా. , 6-19 ఏళ్ల వయస్సు గల పిల్లలకు - 400 మి.గ్రా. ఈ మాత్రలను ఆహారం తీసుకున్న 30 నిమిషాల తర్వాత ఇవ్వాలని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను స్థానిక అంగన్వాడీ, పాఠశాల, కళాశాలకు తీసుకెళ్లి డీవార్మింగ్ మాత్రలు మింగేలా చూడాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఆగస్టు 12న డీవార్మింగ్ చేయబడని పిల్లలకు - ఆగస్టు 20న 'మాప్-అప్ డే' ఆల్బెండజోల్ మాత్రలు ఇవ్వనున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్. చిన్న రాముడు, డిఆర్ఓ టి.సీతారామ మూర్తి, డిఎంహెచ్ఓ కె వెంకటేశ్వర రావు, డిసిహెచ్ఎస్ పద్మ, డీఎస్పీ భవ్య కిషోర్, తదితర అధికారులు పాల్గొన్నారు.

సెంట్రల్ వెజిటబుల్ మార్కెట్ తరలింపు

- దశాబ్దాల సమస్యకు పరిష్కారం
- ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

విశాలాంధ్ర - రాజమండ్రి సిటీ : రాజమండ్రి నగరం నడిబొడ్డున రంభ ఊర్వశి మేనక థియేటర్ల వద్ద ఉన్న సెంట్రల్ వెజిటబుల్ మార్కెట్ (సీవీ మార్కెట్)ను బొమ్మూరుకు తరలించేందుకు కూటమి ప్రభుత్వం జీవో జారీ చేసిందని రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) చెప్పారు. బొమ్మూరు శివాలయం రోడ్డులో ఉన్న శ్రీ ఉమారామలింగేశ్వర స్వామి,శ్రీ సీతా రామ స్వామి ఆలయానికి చెందిన నాలుగు ఎకరాల భూమిలో ఈ మార్కెట్ శాశ్వతంగా ఏర్పాటు చేసేందుకు దేవాదాయశాఖ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆయన చెప్పారు. సీవీ మార్కెట్ సమీపంలోని ఇయ్యపు కూర్మారావు నివాసం వద్ద సోమవారం ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు మీడియాతో మాట్లాడుతూ, రెండు దశాబ్దాలుగా ఎదురు చూస్తున్న ప్రజల కలకు ఇది ముగింపు అని గతంలో ఎన్నో ప్రభుత్వాలు, ఎంతోమంది ప్రజాప్రతినిధులు మారినా పరిష్కారం కాని ఈ సమస్యను కూటమి ప్రభుత్వం సరైన రీతిలో పరిష్కరించిందన్నారు. ఈ తరలింపు రాజమండ్రిలో చరిత్రగా నిలుస్తుందని, రివర్ ఫ్రంట్, అఖండ గోదావరి ప్రాజెక్టుల మాదిరి ఇది కూడా చారిత్రాత్మక ముందడుగు అని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అభివర్ణించారు. ఈ మార్కెట్ తరలింపు వల్ల ఇకపై చుట్టుపక్కల ,ప్రధాన రహదారిపై ట్రాఫిక్ అడ్డంకులు ఉండవని మార్కెట్ పరిసర ప్రాంతాల్లో పార్కింగ్ సమస్యకు పరిష్కారం లభిస్తుందని ఆయన చెప్పారు. శ్రీ లక్ష్మీ గణపతి ఆనియన్, పొటాటో, వెజిటబుల్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, టీడీపీ నాయకులు మజ్జి రాంబాబు మాట్లాడుతూ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాటమీద నమ్మకం, గౌరవంతో వర్తకులు బొమ్మూరు తరలి వెళ్ళేందుకు ముందుకు వచ్చారని కృతజ్ఞతలు తెలిపారు. బొమ్మూరులో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆయన కోరారు. విలేకరుల సమావేశంలో కూటమి నాయకులు కాశీ నవీన్ కుమార్, వర్రే శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర -పెరవలి : మండలంలో గల కడింపాడు గ్రామంలో శెట్టిబలిజ రామాలయం వద్ద గల కమ్యూనిటీ హాలులో సోమవారం పెరవలి మండలం లైన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో విష్ణు దంత వైద్య కళాశాల భీమవరం సహకారంతో ఉచిత దంత వైద్య శిబిరం పాలకొల్లు రాజవల్లి రాధారమణ లైన్స్ కంటి ఆసుపత్రి వారి సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించడం జరిగింది. ఈవైద్య శిబిరాలను రవళి స్పిన్నర్స్ జేఎండి తణుకు మాజీ మున్సిపల్ చైర్పర్సన్ వంక రాజకుమారి ప్రారంభించారు. వంక రాజకుమారి మాట్లాడుతూ పెరవలి మండలం లైన్స్ క్లబ్ ఏర్పాటు చేసే ఉచితంగా వైద్య శిబిరాలకు బీమవరం విష్ణు దంత వైద్య కళాశాల వారి సహకారం మరువలేనిదన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సేవలు అందిస్తున్న పెరవలి మండలం లైన్స్ క్లబ్‌కు విష్ణు దంత వైద్య కళాశాల వారు అందించే సహకారంతో పెరవలి మండలంలోని 18 గ్రామాలకు చెందిన దిగువ మధ్య తరగతి ప్రజలకు చక్కటి సేవలు లభిస్తున్నాయన్నారు. అదేవిధంగా పాలకొల్లు లైన్స్ కంటి ఆసుపత్రి వారి సహకారంతో పెరవలి మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో చక్కటి కంటి వైద్య సదుపాయాలు కల్పిస్తున్నారని అందుకు లైన్స్ కంటి ఆసుపత్రి యాజమాన్యానికి ధన్యవాదాలు అన్నారు. ఈ కార్యక్రమానికి స్పాన్సర్ గా వ్యవహరించిన సోలార్ కంపెనీ శ్రీ స్వార్ప్ ఇన్ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ వారికి పెరవలి మండలం లైన్స్ క్లబ్ సభ్యులు ధన్యవాదాలు తెలియజేశారు. ఈకార్యక్రమంలో పెరవలి మండలం లైన్స్ క్లబ్ అధ్యక్షుడు దేవరపు వెంకట్రాయుడు,సెక్రెటరీ సలాది ఉదయ భాస్కరరావు, ట్రెజరర్ బూరుగుపల్లి రాజు, పెరవలి మండలం లైన్స్ క్లబ్ మెంబర్లు కోటిపల్లి మురళీకృష్ణ, కార్చెర్ల సీతారాం ప్రసాద్, దేవరపు ఏడుకొండలు, చంటిరాజు తోపాటు పెరవలి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

తల్లిపాల వారోత్సవాలు

విశాలాంధ్ర-పెరవలి : మండలంలో అనేక అంగన్వాడీ కేంద్రాలలో సోమవారం తల్లిపాల వారోత్సవ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ తల్లి పాలయొక్క ప్రాముఖ్యత గురించి వివరించారు. గర్భిణీ స్త్రీగా ఉన్నప్పుడు ఆ ఎం సిపి కార్డ్‌లో వాళ్ళు బరువు ఎత్తు వాళ్ళ హెచ్బి పర్సంటేజ్ డెలివరీ అయిన తర్వాత వాళ్ళు వేయించవలసిన బేబీకి ఇమేజెస్ గురించి వివరించారు. ఆ కార్డు చాలా జాగ్రత్తగా పెట్టుకో వాలని రేషన్ కార్డు ఎంత ఇంపార్టెంట్ మనకి ఎంసిపి కార్డ్ ఇంపార్టెంట్ అని వివరించడం జరిగినది అలాగే మురిపాల గురించి తల్లిపాలు ఇచ్చే పొజిషన్ IYCF గురించి తల్లిపాలతో పాటు ఆరు నెలల తర్వాత అనుబంధ పోషకాహారం పెట్టాలని వివరించడం జరిగినది. ఈకార్యక్రమాలలో స్థానిక నాయకులు తల్లులు అంగన్వాడీ ఆరోగ్య మహిళాపోలీస్ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

పూల వర్తక సంఘం నూతన కమిటీ ఎంపిక

విశాలాంధ్ర - కడియం : కడియం మండలం, కడియపుసావరం పుష్పలత పూలవర్తక సంఘం నూతన అధ్యక్షుడిగా పూలవ్యాపారి గంధం దుర్గారావు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. అధ్యక్షుడిగా ఇప్పటివరకు పనిచేసిన చెన్నా శ్రీనివాసరావు తన బాధ్యతలను నూతన అధ్యక్షులు దుర్గారావుకు బదలాయించారు. స్థానిక పుష్పలత పూలవర్తక సంఘ భవనంలో ఆదివారం కార్యక్రమం జరిగింది. నూతన అధ్యక్షుడిగా ఎంపికైన దుర్గారావు మాట్లాడుతూ మూడు దశాబ్దాలకు పైగా చరిత్ర, వందలాది మంది సభ్యులు గల ప్రతిష్టాత్మకమైన పూలవర్తక సంఘం అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎంపిక చేసిన కమిటీ పెద్దలకు, సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యక్షులుగా కేశవరపు అర్జున్, సెక్రటరీగా మంగిన దుర్గారావు, జాయింట్ సెక్రటరీగా వరగోగుల శ్రీను, జ్యోతుల వీరబాబు, సభ్యులుగా వేగిరౌతు మణికంఠ, గుండుపల్లి నగేష్, రాళ్ళపూడి చిన్నరాయుడు, గంధం చిన్నవెంకన్న, రావిపాటి నాగేశ్వరరావు, కేసన దుర్గారావు, కూసి సూర్యనారాయణ, గంధం వెంకన్నబాబు, తమల శేషగిరి, చలపల్లి శ్రీను, కామిరెడ్డి కృష్ణ, బోయిడి ఏడుకొండలు, సింగులూరి కృష్ణ, సాపిరెడ్డి దొరబాబు లు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీ కి సంఘ గౌరవ అధ్యక్షులు వరగోగుల వెంకటేశ్వరరావు, గ్రామ సర్పంచ్ చెక్కపల్లి మురళీకృష్ణ, ఎంపిటిసి సాపిరెడ్డి దుర్గా కామేష్, మాజీ సర్పంచ్ తుమ్మెద వరహాల రాజు, మాజీ ఎంపిటిసి రావిపాటి రామకృష్ణ, ఆకుల శ్రీధర్, పలువురు పూల రైతులు, వ్యాపారులు శుభాకాంక్షలు తెలిపారు.

ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడిగా పాతూరి

విశాలాంధ్ర - రాజమండ్రి సిటీ: భారతీయ జనతా పార్టీ జిల్లా నాయకుడు పాతూరి చిరంజీవి రవిశంకర్‌రాజమహేంద్రవరం ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యునిగా నియమితులయ్యారు. ఈ మేరకు ఆసుపత్రి సూపరింటెండెంట్ రవి శంకర్ కు ఉత్తర్వులిచ్చారు. రాష్ట్ర శాసనమండలి సభ్యుడు, బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు ఆయనను శాలువాతో సత్కరించి అభినందించారు. ప్రస్తుతం రవిశంకర్ జిల్లా కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

జాతీయ రహదారిపై ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర - రాజోలు : మండలంలోని తాటిపాక-కడలి రోడ్డు మార్గంలో ఉన్న జాతీయ రహదారిపై ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటు చేయాలని సోషల్ వర్కర్ యాలంగి రమేష్ అధికారులను కోరారు. సోమవారం రాజోలు తహశీల్దార్ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్ సెల్ కార్యక్రమంలో ఆయన ఎంపీడీవో వెంకటేశ్వరరావు వినతిపత్రం అందజేశారు. మండలంలో జాతీయ రహదారికి అనుసంధానంగా ఉన్న బి సావరం, శివకోడు, గెద్దాడ గ్రామాల్లో జాతీయ రహదారిపై ట్రాఫిక్ సిగ్నల్ లేకపోవడంతో తరచు రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. తక్షణమే అధికారులు స్పందించి జాతీయ రహదారిపై ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటు చేయాలని ఏర్పాటు చేయాలని కోరారు.

కుండ పోత వర్షం

విశాలాంధ్ర - కరప : కరపలో సోమవారం కుండ పోత వర్షం కురిసింది. వాతావరణంలో వచ్చిన మార్పులు కారణంగా ఉన్నట్టుండి ఒక్కసారిగా భారీ వర్షం కురవడంతో డ్రైనేజీలు రోడ్లపై పొంగి పొరలినాయి, డ్రైనేజీలలో పూడిక తీయకపోవడం, ప్రధాన కూడళ్లలో డ్రైనేజీలపై సిమెంట్ దిమ్మలు వేసి మూసివేయడంతో నీరు పోయే మార్గం లేక రోడ్లు వెంబడి వాహన సోదకులకు, ప్రయాణికులు రెండు గంటల పాటు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. స్కూల్ పిల్లల ఆటోలు రోడ్లపై రావడానికి చాలా ఇబ్బందులు పడ్డారు. గతంలో డ్రైనేజీలపై సిమెంట్ దిమ్మల తొలగించి నీరు పోయే మార్గాన్ని పంచాయితీ అధికారులు ఏర్పాటు చేయగా వాటిని యధావిధిగా మూసి వేసి నీరు పోయే మార్గం లేకుండా చేయడం పట్ల గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. ఎంపీడీవో ఆఫీస్ పక్కన నీరు పోయే మార్గం లేక వాగులా మెయిన్ రోడ్డు తలపిస్తుంది. కరప వాటర్ ట్యాంకు వద్ద మంచినీళ్లు పట్టుకోవడానికి వెళ్లేందుకు వీలు లేకుండా భారీ వర్షానికి డ్రైనేజీల్లో నీరు పొంగి మునిగిపోయింది. ఎక్కడ చూసినా మీరు రాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీనిపై అధికారులు స్పందించి నీరు పోయే మార్గాలు ఏర్పాటు చేయాలని ప్రజల కోరుతున్నారు.

ఘనంగా సీఎం రంగసామి జన్మదిన వేడుక

విశాలాంధ్ర - యానాం : ప్రజల మనిషి నిరుపేదల ఆశాజ్యోతి ప్రజా సేవలో అలుపెరగని సేవకుడు యానాం ప్రజల ప్రియతమ నాయకుడు పుదుచ్చేరి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్.రంగస్వామి 75వ పుట్టినరోజు వేడుకను యానాంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు అభిమాన సంఘం, యానాం ఎన్నార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో యానాం ఓల్డ్ ఏజ్ హోమ్‌లో నాయకులు, అభిమానులు, కార్యకర్తలు, పాల్గొని సీఎం రంగస్వామి పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించి కేక్ కటింగ్ చేసి స్వీట్స్ పంచారు. యానాం ఓల్డ్ ఏజ్ హోమ్‌లో వృద్ధులకు, యానాం గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్‌లో ఉన్న పేషెంట్లకు, తాళ్లరేవు శామ్యూల్ సాగర్ వారి పాఠశాల, కోరంగి అనాధాశ్రమంలలో ఫ్రూట్స్ అందజేశారు. యానాం ఎన్ఆర్ కాంగ్రెస్ అధ్యక్షులు మల్లాడి శామ్యూల్, యానాం మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ పెండెం సూర్య ప్రకాష్, యానాం రిటైర్డ్ సీఐ గూటం శివ గణేష్, తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవ చెల్లింపులపై కలెక్టర్ సమీక్ష

విశాలాంధ్ర - తూర్పుగోదావరి : అన్నదాత సుఖీభవ – పీఎం కిసాన్ యోజన కింద జిల్లాలో తొలివిడతలో లబ్దిదారులైన రైతుల ఖాతాల్లో నిధులు జమ కావడంపై, కొన్ని కేటగిరీల్లో నిధులు జమ కాకపోవడంతో వాటి గురించి సమగ్ర నివేదిక సమర్పించాలని జిల్లా కలెక్టర్ శ్రీమతి పి. ప్రశాంతి అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ ఎస్. చిన్న రాముడు, వ్యవసాయ, రెవెన్యూ, సాంకేతిక శాఖల అధికారులతో కలిసి నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు.ఈ సందర్భంగా కలెక్టర్ పి ప్రశాంతి మాట్లాడుతూ, కొంతమంది రైతుల ఖాతాల్లో నిధులు జమ కాకపోవడం నేపథ్యంలో ఫెయిల్డ్ కేటగిరీలను స్పష్టంగా గుర్తించాల్సిన అవసరం ఉందని తెలిపారు. గ్రామ పంచాయతీ, రైతు సేవా కేంద్రాల వారీగా పరస్పర పొంతన లేని వివరాలు గుర్తించి, వాటిపై ఆధారితంగా సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఫెయిల్డ్ కేటగిరీ క్రింద గుర్తించబడిన వాటిలో ఆధార్ వివరాలు సరిపోలకపోవడం, బ్యాంకు ఖాతా అమాంతం లేకపోవడం, ఎన్‌పీసీఐ పేమెంట్ పెండింగ్ , మరణించిన లబ్దిదా రులు , తాత్కాలిక భూ యాజమాన్య ధృవీకరణ పత్రం, భూ వివాదాలు , సర్వే కాని భూములు , జాయింట్ ఎల్పీఎం లావాదేవీలు వంటివి కారణాలు గుర్తించినట్లు తెలిపారు. ఈ లోపాలను తహసీల్దార్ స్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని, అందులో నిర్లక్ష్యానికి ఆస్కారం ఉండకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. మరణించిన లబ్దిదారుల వారసులు మ్యుటేషన్ కోసం దరఖాస్తు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా స్థాయిలో అన్ని మండలాలలో రెవెన్యూ మరియు వ్యవసాయ శాఖల సమన్వయంతో రికార్డు పరిశుద్ధి త్వరితగతిన పూర్తి చేయాలని చెప్పారు. తొలి విడతలో వివిధ కారణాల వల్ల నిధులు పొందలేని అర్హులైన రైతులకు, రెండో విడత నిధులు విడుదల సమయంలో రెండో విడతతో పాటు మొదటి విడత చెల్లింపులు కలిపి జమ చేయనున్నట్లు కలెక్టర్ వివరించారు. రైతుల ఖాతాల్లో నిధులు ఎందుకు జమ కాలేదన్న విషయాన్ని సర్వే నంబర్ వారీగా స్పష్టంగా విశ్లేషించి, అన్ని వివరాలతో గ్రామ పంచాయతీ, ఆర్ ఎస్ కె వారీగా కూడిన నివేదిక సిద్ధం చేయాలని ఆమె ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్. చిన్న రాముడు, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్. మాధవరావు, ఈడీఎంసీ సతీష్, పెరవలి, రాజమండ్రి రూరల్, గోకవరం, రాజానగరం తహసీల్దార్లు, మండల వ్యవసాయ అధికారులు, రైతు సేవా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై అర్జీలు

విశాలాంధ్ర - పిఠాపురం : ప్రజా సమస్యల పరిష్కార నిమిత్తం ఏర్పాటు చేయబడిన ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం మున్సిపల్ గెస్ట్‌హౌస్ పాడా కార్యాలయంలో పాడా పీడి సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి పిఠాపురం నియోజకవర్గ డివిజనల్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. ప్రజల నుంచి వారి యొక్క సమస్యను అర్జీలు రూపంలో స్వీకరించారు. పిఠాపురం పట్టణం రామా థియేటర్ వద్ద రాజా రామ్మోహన్ రాయ్ పార్కులో ఇటువంటి సదుపాయాలు లేవని విషపూరితమైన పాములు సంచరిస్తున్నాయని పార్క్‌లో చెట్లు కూలిపోయి చెత్తాచెదారం పెరిగిపోయిందని వాకర్స్ పాడా కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. స్మార్ట్ మీటర్లు బిగించవద్దంటూ సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో పాడా కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. సీపీఎం జిల్లా నాయకుడు శేషు బాబ్జీ కోనేటి రాజు స్మార్ట్ మీటర్లు బిగించడంపై మండిపడ్డారు. పిఠాపురం పట్టణంలో చెరుకుల కాలవ గుర్రాల కాలవ ఆక్రమణ గురి అయిందని సీపీఐ పిఠాపురం కార్యదర్శి సాకా రామకృష్ణ పాడా కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. అదేవిధంగా చెరుకుల కాలంలో ఉన్న కూడికను తీసి తన స్థలంలో వేశారని అద్దంకి గోపాలస్వామి పాడా కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. పిఠాపురం పాడా కార్యాలయంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కాయగూరలను, పప్పు దినుసులను రైతుల ద్వారా స్టాల్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాడా డిప్యూటీ వసంత మాధవి తహసీల్దార్ గోపాలకృష్ణ ఎండిఓ స్వప్న పాల్గొన్నారు.

ప్రైవేట్ బ్యాంకుల వేధింపులు అరికట్టాలి

విశాలాంధ్ర - అమలాపురం : అధిక వడ్డీలకు అప్పులు ఇచ్చి దళిత బలహీన వర్గాల మహిళలను వేధింపులకు గురిచేసి భౌతిక దాడులు చేసి వారి మృతికి కారణం అవుతున్న ప్రైవేటు బ్యాంకుల ఆగడాలను అరికట్టాలని సోమవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు కేవీపీఎస్ సీపీఎం, సీఐటీయూ, దళితసేన తదితర ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సీపీఎం పార్టీ జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు, కెవిపిఎస్ జిల్లా కన్వీనర్ శెట్టిబత్తుల తులసిరావు, సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జి దుర్గాప్రసాద్, ఎన్ బలరాం తదితరులు మాట్లాడుతూ డా బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో వివిధ ప్రైవేట్ బ్యాంకులు ఫైవ్ స్టార్ ఆర్బిఎల్ కార్డ్, కోటక్ మహీంద్రా కార్డ్, ఎస్బిఐ కార్డ్, మ్యాక్సిమల్ బ్యాంక్, కోస్టల్ బ్యాంక్ మహీంద్రా ఫైనాన్స్, శ్రీరామ్ చిట్స్, బందనా, టాటా క్యాపిటల్ లాంటి బ్యాంకుల నుంచివాలామంది అమాయకులకు అధిక వడ్డీలకు అప్పులు ఇస్తున్నారు. కుటుంబ అవసరాలు, అనారోగ్యాలు, పిల్లల చదువులు, ఇంటి నిర్మాణాల పేరుతో ఈ ప్రైవేట్ బ్యాంకుల నుంచి దళితులు, బలహీన వర్గాలకు చెందిన మహిళలు, యువకులు అప్పులు తీసుకొని అధిక వడ్డీలు చెల్లించలేక చాలా ఇబ్బందులకు గురవుతున్నారని వారు వాపోయారు. ఉదాహరణ అల్లవరం మండలం, తాడికోనకు చెందిన ఒక దళిత మహిళ, అంగన్వాడీ వర్కర్ గెద్దం మణికుమారి ఆత్మహత్య చేసుకొని మరణించిందని అలాగే ఈ ప్రయివేటు బ్యాంకుల వారు భౌతికదాడులకు పాల్పడుతున్నారు. కాట్రేనికోన మండలం, పల్లంకుర్రు గ్రామానికి చెందిన విప్పర్తి మోహనరావు అనే దళిత యువకుడిపై మహీంద్రా ఫైనాన్స్‌కు చెందినవారు భౌతికంగా దాడిచేసి గాయపర్చారని ఇలా చాలా గ్రామాల్లో వేధిస్తున్నారని అన్నారు. అనివార్యకారణాల వల్ల అప్పుకట్టకపోతే ప్రైవేటు బ్యాంకుల ఏజెంట్లు ఇంటిముందు కూర్చొని కదలడం లేదు ప్రయివేటు బ్యాంకువాళ్ళు అర్ధరాత్రి వరకు ఇంటి ముందు నుంచి కదలడం లేదని మహిళలను వెకిలి చేష్టలతో వెకిలి చూపులతో మానసికంగా వేధింపులకు గురి చేస్తున్నారని, లైంగిక వేదింపులకు గురిచేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వేధింపులకు గురి చేస్తున్న ప్రైవేటు బ్యాంకులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని, ప్రైవేట్ బ్యాంకుల యాజమాన్యాలతో తక్షణం జిల్లాలో మీటింగ్ పెట్టి స్పష్టమైన ఆదేశాలకు ఇవ్వాలని ఈ సందర్భంగా వారు కలెక్టర్ని కోరడం జరిగింది. ఈ కార్యక్రంలో బాధితులు గెద్దం ఏసురాజు, విప్పర్తి మోహనరావు, దళిత సేన జిల్లా అధ్యక్షులు డేవిడ్ అంబేద్కర్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సమస్యలు పరిష్కరించాలని వినతి

విశాలాంధ్ర - అమలాపురం : రైతాంగ సమస్యలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కూటం ప్రభుత్వం వెంటనే రైతు సమస్యలు పరిష్కరించాలని వైసీపీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం పార్టీ నాయకులు కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా వైసీపీ పార్టీ అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి మాట్లాడుతూ రైతులకు సకాలంలో యూరియా, ఎరు వులు అందించాలని. అన్నదాత సుఖీభవ పథకాన్ని రైతులందరికీ వర్తింప చేయాలనీ ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పినిపే విశ్వరూప్, ఎమ్మెల్సీలు కుడిపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇస్రాయిల్, జడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, అమలాపురం నియోజకవర్గం వైసీపీ పార్టీ కో ఆర్డినేటర్ పినిపే శ్రీకాంత్, వైసీపీ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, రామచంద్రపురం నియోజకవర్గ పిల్లి సూర్యప్రకాష్, నాయకులు పితాని బాలకృష్ణ, తోరం గౌతం, నాతి శ్రీనివాసరావు, కేతా భాను తేజ తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాల వారోత్సవాలు

విశాలాంధ్ర-దేవరపల్లి: ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు కార్యక్రమంలో భాగంగా సోమవారం దేవరపల్లి మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలకు, గర్భిణులకు, బాలింత తల్లులకు దేవర పల్లి సచివాలయం 3 రైతు భరోసా కేంద్రం వద్ద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న గోపాలపురం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఓ డి. మమ్మీ మాట్లాడుతూ బిడ్డ పుట్టిన అరగంటలోపే ముర్రుపాలు పట్టాలని బిడ్డకు తల్లిపాలు ఇవ్వడం వలన వారి మధ్య ప్రేమ అనుబంధం పెరుగుతుందని ముర్రిపాలు బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి ఇస్తాయని తల్లిపాలు తాగడం వలన బిడ్డకు ఐజి లెవెల్స్ పెరిగి తెలివైన ప్రయోజకుడైన బిడ్డను సమాజానికి ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. తల్లిపాలు ఇవ్వడం వలన తల్లికి క్యాన్సర్, ఇతర ఎలర్జీలు రాకుండా కాపాడుకోవచ్చునన్నారు బిడ్డకు బిడ్డకు దూరం పెరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవరపల్లి పిహెచ్సి సిహెచ్ఓ సత్యవతి పిహెచ్ఎన్ పి విజయలక్ష్మి అంగన్వాడి సెక్టార్ సూపర్వైజర్స్ ఎం విజయలక్ష్మి ఎం శశికళ బి విజయశాంతి ఏఎన్ఎంలు ఎమ్మెల్యే హెచ్ పి లు అంగన్వాడి వర్కర్లు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

శనీశ్వరుని దర్శించుకున్న సింగర్ మనో

విశాలాంధ్ర - కొత్తపేట : ప్రముఖ ప్రసిద్ధిగాంచిన మందపల్లి మందేశ్వర శనేశ్వర స్వామి ఆలయాన్ని ప్రముఖ గాయకుడు మనో సోమవారం దర్శించుకున్నారు. సతీ సమేతంగా వచ్చిన ఆయనను ఆలయ మర్యాదలతో అధికారులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన శనీశ్వర స్వామికి ప్రత్యేక పూజలు, తైలా అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శని దోషం ఉన్నవారే శనీశ్వరుని దర్శించుకోవాలని అపోహ నుండి ప్రతి ఒక్కరూ బయటకి వచ్చి అందరూ కూడా ఆ స్వామిని దర్శించుకుని సకల గ్రహదోషాల నుంచి విముక్తిని పొందాలన్నారు. శనీశ్వరునిచే ప్రతిష్టింపబడిన శివలింగం కాబట్టి ప్రతి ఒక్కరు దర్శించుకోవచ్చని ఆయన కోరారు.

తిరుమల శ్రీవారి సేవలో ఎమ్మెల్యే బండారు

విశాలాంధ్ర - ఆత్రేయపురం : తిరుమల శ్రీవారి దివ్య దర్శనానికి కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు హాజరయ్యారు. ఆయన తన సోదరుడు బండారు శ్రీనివాస్, కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. అనంతరం రంగనా యకుల మండపంలో టీటీడీ పండితులు ఎమ్మెల్యే కుటుంబానికి వేదాశీర్వచనాలు అందించగా, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు మాట్లాడుతూ "శ్రీవారి అనుగ్ర హంతో రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉండా లని, కొత్తపేట నియోజకవర్గ అభివృద్ధి కోసం నిత్యం ప్రయత్నిస్తానని పేర్కొన్నారు. దర్శన సమయంలో ఎమ్మెల్యే కుటుంబానికి టీటీడీ అధికారులు ఏర్పాట్లు చేశారు.

పనిచేయని స్మార్ట్ ఫోన్లు మాకొద్దు

విశాలాంధ్ర - కాకినాడ రూరల్ : ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా కాకినాడ రూరల్ ప్రాజెక్టు పరిధిలో ఉన్న తొమ్మిది సెక్టార్ల అంగన్వాడిలు నెట్వర్క్ లేని స్మార్ట్ ఫోన్లు సిడిపిఓ కార్యాలయంలో తిరిగి ఇచ్చేచారు. కాకినాడ రూరల్ ప్రాజెక్ట్ అధ్యక్ష, కార్యదర్శులు పి వీరవేణి, ఎ వీరమణి మాట్లాడు తూ నెట్వర్క్ పనిచేయని ఫోన్‌లతో 11 యాప్‌ల భారంతో పనిచేయలేక ఫోన్లు తిరిగి సిడిపిఓ కార్యాలయంలో అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం నాలుగు సంవత్సరాల క్రితం ఇచ్చిన స్మార్ట్ ఫోన్‌లో నెట్వర్క్, నెట్ ఇతర సౌకర్యాలు లేక రిపోర్టులు సక్ర మంగా అందించక అధికారులు వేధింపులు ఎక్కువవు తున్నాయి అన్నారు. అంగన్వాడీ సెంటర్లో రికార్డులో రాసి లబ్ధిదారు లకు పోస్టుకాహారం అందజేస్తా మన్నారు. సిఐటియు కాకినాడ రూరల్ మండల కార్యదర్శి టి రాజా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు యాప్‌లు భారం తగ్గిస్తా మని హామీ ఇచ్చి నేడు అధికారంలోకి వచ్చిన తర్వాత మాట మార్చిందని విమర్శించారు. చంద్రబాబు పాలన విజన్ ఉంటుంది కానీ అంగన్వాడీ టీచర్లకు ఇచ్చే ఫోన్లో నెట్వర్క్ ఉండటం లేదని విమర్శించారు. సెక్టార్ లీడర్లు సత్యవేణి, రాజేశ్వరి, లక్ష్మి, తనుజ, వరలక్ష్మి, భవాని పాల్గొన్నారు.

నిధులు సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర-దేవరపల్లి: గ్రామాలలో త్రాగునీరు అందించటానికి అదనపు మోటార్లు కొనుగోలు చేయడానికి మంజూరు చేసిన నిధులు గ్రామపంచాయతీలు వినియోగించకపోతే ఆ నిధులను వేరే అభివృద్ధి కార్యక్రమాలకు కేటాయిస్తామని దేవరపల్లి ఎంపీపీ కేవీకే దుర్గారావు పేర్కొన్నారు. దేవరపల్లి మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం సోమవారం సాయంత్రం ఎంపీపీ కెవికె దుర్గారావు అధ్యక్షతన జరిగింది ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ మండలంలో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల అమలకు అధికారులు ప్రజాప్రతినిధులు మరి అంత కృషి చేయాలన్నారు ఆర్డబ్ల్యూఎస్ ఏఈ కుమారి మాట్లాడుతూ మండలంలో డ్రైన్లు పైపులైన్ విస్తరణ పనులు జరుగుతున్నాయన్నారు. కొన్ని పంచాయతీలకు అదనంగా మంచినీటి ట్యాంకులు మంజూరైనట్లు తెలిపారు. మండల వ్యవసాయాధికారి కే కమలరాజు మాట్లాడుతూ దేవరపల్లి మండలంలో 8500 ఎకరాలలో వరినట్లు వేయవలసి ఉండగా 8350 ఎకరాలలో నాట్లు వేయటం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు ఈ క్రాపు నమోదు చేసుకోవాలని అన్నారు. దేవరపల్లి మండలంలో అన్నదాత సుఖీభవ పిఎం కిసాన్ ద్వారా 6 వేల 769 మంది రైతు ఖాతాలకు 4 కోట్ల 60 లక్షల రూపాయలు జమ అయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్కో ఏఈ ఏఈవెంకట్రావు మాట్లాడుతూ మండలంలో వివిధ గ్రామాలలో త్రీఫేస్ విద్యుత్ సౌకర్యం కల్పిస్తామని దీనివలన గ్రామాలలో అనేక పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవటానికి అవకాశం ఉంటుందని తెలిపారు ఈ కార్యక్రమంలో కుమార్ ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో శ్రీనివాస, ఎంఈఓ తిరుమల దాసు, తహసీల్దార్ శ్రీనివాస్ ఇన్చార్జి ఎంపీడీవో వై రాజారావు మండల పరిషత్ సూపరిండెంట్ జి శాంతి వైస్ ఎంపీపీలు కొర్లపాటి అరుణ సాదే సుబ్బారావు ఎంపీటీసీలు బొంత చినబాబు కాళ్ల వెంకటరత్నం సర్పంచులు గ్రామ కార్యదర్శులు ఎంపీటీసీలు పాల్గొనగా వివిధ శాఖల అధికారులు తమ శాఖల పనితీరును అభివృద్ధి నిర్వహించారు.

ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం

విశాలాంధ్ర - ఆత్రేయపురం : దశాబ్దాలుగా బ్యాంక్ కెనాల్ ఎడమ గట్టు ఆయకట్టు రైతులను వేధిస్తున్న ముంపు సమస్యకు కూటమి ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపుతోంది. గతంలో నాట్లు వేసిన పంటలు ముంపు నీటితో నష్టపోయిన నేపథ్యంలో, సమస్యను దగ్గరనుండి గమనించిన కొత్తపేట శాసనసభ్యులు బండారు సత్యానందరావు ప్రత్యేక శ్రద్ధతో చర్యలు చేపట్టారు. ఆయన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ రావిరాల మహేష్ కుమార్‌తో చర్చించి రూ.19 లక్షలు 40 వేలు నిధులను మంజూరు చేయించారు. ఈ నిధులతో లొల్ల-పలివెల మురుగుకాలువ పూడికతీత పనులకు ఈరోజు శ్రీకారం చుట్టారు. ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ కరుటూరి నరసింహారావు, డ్రైనేజీ అసిస్టెంట్ ఇంజనీర్ విజయలక్ష్మి, అంకంపాలెం నీటి సంఘం ఉపాధ్యక్షుడు బందేల శ్రీను, రైతులు పెండెం వెంకన్న, చిట్టూరి త్రినాథరావు, గుల్లపల్లి శ్రీను, మండపాక సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు. సైఫన్ దగ్గర నుండి ప్రారంభమైన పూడికతీత పనులు త్వరితగతిన పూర్తి చేసి పూర్తిస్థాయిలో సాగునీరు కల్పించేలా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. రైతులకు నష్టం లేకుండా, సాగుకు నిరవధిక నీరు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని నాయకులు హామీ ఇచ్చారు.

జాతీయ రహదారిపై తప్పిన పెను ప్రమాదం

స్వల్ప గాయాలతో బయటపడ్డ కొత్తపేట ఎంపిడివో

విశాలాంధ్ర - కొత్తపేట : జొన్నాడ 216(ఏ)జాతీయ రహదారిపై ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు అత్యంత జాప్యంతో ప్రారంభంలో నిర్మించిన సర్వీస్ రోడ్లు పూర్తిగా అధ్వాన్నంగా తయారైన విషయం విధితమే. ఇరువైపులా రహదారి మొత్తం గుంతలు ఏర్పడి, రాళ్లు తేలిపోయి ఉన్నాయి. దీంతో వాహనదారులు తమ వాహనాలపై ప్రయాణిస్తూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు ఎందరో ప్రమాదాల బారిన పడుతున్నారు. దీనిపై ఇటీవల స్థానికులు రోడ్డుపై నిరసన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో సోమవారం కొత్తపేట మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి నరేష్ కుమార్ తమ నివాసమైన రాజమండ్రి నుండి కొత్తపేట మండల పరిషత్‌కు విధుల కోసం కారులో వెళుతున్నారు. ఇంతలో ఆయన కారు సర్వీస్ రోడ్ల గుంతల్లో పడి డివైడర్ పైకి ఎక్కి పల్టీ కొట్టి తలకిందులుగా పడిపోయింది. సమయానికి వెనుకగా ఏ విధమైన వాహనాలు రాకపోవడంతో తృటిలో పెను ప్రమాదం తప్పి ఆయన స్వల్ప గాయాలతో బయటపడ్డారు. వెంటనే అక్కడ ఉన్న హైవే పెట్రోలింగ్ సిబ్బంది సాయి కుమార్, స్థానికులు స్పందించి ట్రాఫిక్ నియంత్రించారు. విషయం తెలుసుకున్న ఆలమూరు ఎంపిడివో ఏ రాజు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని అయన్ని పరామర్శించి హాస్పటల్‌కి తరలించారు. సర్వీస్ రోడ్డు సరిగ్గా లేకపోవడం వల్ల వాహనం అదుపుతప్పి ప్రమాదం జరిగిందని వారు వివరించారు.

మార్గదర్శి ఫౌండేషన్ స్కూల్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి

అఖిల భారత విద్యార్థి సమాఖ్య డిమాండ్

విశాలాంధ్ర - అమలాపురం : ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా నడుస్తున్న పాఠశాలలపై ప్రభుత్వ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం వారి తప్పులను దాచిపెట్టి చూసి చూడనట్లు వ్యవహరించడం అధికారులకు అలవాటుగా మారిపోయిందని జిల్లా అధ్యక్షులు వెంకట్ ఆరోపించారు. రాయవరం మండలం మాచవరం గ్రామంలోని మార్గదర్శి ఫౌండేషన్ స్కూల్ ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా ఏడవ తరగతి వరకు మాత్రమే అనుమతులు ఉన్న పదవ తరగతి వరకు చెప్తున్నారు. అలాగే రేకుల షెడ్డులో తరగతులు నిర్వహిస్తున్నారు. ఇదే స్కూల్ ప్రిన్సిపాల్ జయరాజు వారి దగ్గర చదువుతున్న 9వ తరగతి విద్యార్థిని గర్భిణీని చేసి పరారీ అయ్యారని విద్యార్థిని తల్లితండ్రులు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడం జరిగింది. మహిళా విద్యార్థినీలకు రక్షణ లేనటువంటి ఇలాంటి స్కూల్స్ అనుమతులు రద్దు చేసి సీజ్ చేయాలని కోరుతున్నాం. అలాగే ప్రిన్సిపాల్ జయరాజును అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు సందీప్, సహాయ కార్యదర్శి సాయిరాం, రామచంద్రపురం టౌన్ అధ్యక్షులు విజయ్, శరత్ ,చందు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

విశాలాంధ్ర - పెదపూడి : రాష్ట్ర అభివృద్ధి, పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో నూతనంగా రూ.10 లక్షలతో ఏర్పాటు చేసిన ఎక్స్ రే యూనిట్, సుమారు రూ.2.50 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన ఆర్వో వాటర్ ప్లాంట్ ఎమ్మెల్యే నల్లమిల్లి ప్రారంభించారు. అనంతరం జరిగిన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట ధర్నా

విశాలాంధ్ర - అమలాపురం : విద్యుత్ స్మార్ట్ మీటర్లుకు వ్యతిరేకంగా మంగళవారం ఉదయం 10 గంటలకు అమలాపురం విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట భారీ ఎత్తున చేపట్టిన ప్రజా వేదిక ధర్నాను విజయవంతం చేయాలని ఏఐటీయుసి ఉమ్మడి జిల్లా అధ్యక్షులు కే సత్తిబాబు పిలుపునిచ్చారు. వామపక్ష ప్రజా సంఘాలు, ఎఐకెయస్ రైతు సంఘాలు ఎఐటీయూసీ-సిఐటియు కార్మిక సంఘాలు అందరూ కలిసి పాల్గొనాలని ఆయన కోరారు. అన్ని ప్రజా సంఘాలు, కార్మిక సంఘాల ప్రతినిధులకు సమాచారం పంపించి అందరూ కచ్చితంగా ధర్నాలో పాల్గొనేలా చూడాలని ద్వితీయశ్రేణి నాయకులకు సత్తిబాబు ఆదేశాలు జారీ చేశారు.

బాబు షూరిటీ - అమలు గ్యారంటీ

విశాలాంధ్ర - మామిడికుదురు : ఎన్నికలు ముందు హామీ ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలు అమలు దిశగా కూటమి ప్రభుత్వం పని చేస్తుంటే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పథకాలు అమలు చేయడం లేదని ప్రచారం చేయడం హాస్యాస్పదంగా ఉందని నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షులు ఈలి శ్రీనివాస్ పేర్కొన్నారు. అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్, నిధులు రూ.7000లు రైతులు ఖాతాలో జమ కావడంతో వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారని, తల్లికి వందనం, ఉచిత గ్యాస్ సిలండర్ పథకాలు అమలు జరగడంతో ప్రజలు హర్షాతి రేఖాలు వ్యకం చేస్తున్నారన్నారు. భర్త చనిపోయిన అర్హులైన వితంతు మహిళలు అందరికి కొత్తగా పెన్షన్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. సంక్షేమం, అభివృద్ధి పరుగులు తీస్తున్న సంగతిని వైసిపి పార్టీ గ్రహించాలన్నారు. కంచి విశ్వనాధం, నామన రాధాకృష్ణ, అప్పారి వెంకటేశ్వ రరావు, సాపే ఏకాదశి, పెచెట్టి విజయ భాస్కరరావు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయంలో పవిత్రోత్సవాలు

విశాలాంధ్ర - ఆత్రేయపురం : వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో పవిత్రోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. సోమవారం విశ్వక్సేన పూజ, పుణ్యాహవ చనంతో ఉత్సవాలకు శాస్త్రోక్తంగా శ్రీకారం చుట్టారు. ఋత్వికులు దీక్షాధారణ చేసి, హోమాలు, మంత్రపుష్పార్చన, తీర్థ ప్రసాద వితరణ వంటి పూజాకార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం అంకురార్పణ, నవమూర్తి ఆవాహన, పంచగవ్య ప్రోక్షణ తదితర వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు పర్యవేక్షణలో మూడు రోజుల ఈ ఉత్సవాలు ప్రతిష్టాత్మకంగా కొనసాగుతున్నాయి.

అర్జీలు పరిష్కరించాలి

విశాలాంధ్ర -భీమవరం: అర్జీల పరిష్కార తీరు పారదర్శకత ఉండాలని అర్జీలు రీ ఓపెన్ కు ఆస్కారం లేకుండా పరిష్కరించాలని ఇన్చార్జి కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ పిజిఆర్ఎస్ సమావేశ మందిరంలో ఇంచార్జి జిల్లా కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డితో పాటు డిఆర్ఓ మొగిలి వెంకటేశ్వర్లు, కె.ఆర్.ఆర్.సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణ గ్రామ, వార్డు సచివా లయ అధికారి, వై.దొసిరెడ్డి, డ్వామా పిడి డా.కెసిహెచ్ అప్పారావు జిల్లాలో పలు ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి ఫిర్యాదు లను స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ ఈ రోజు జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా జిల్లాలో పలు ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదా రుల నుంచి 191 ఫిర్యాదులను స్వీకరించడం జరిగిందని తెలిపారు. సమావేశంలో వయో వృద్ధుల ట్రిపునల్ సభ్యులు మేళం దుర్గాప్రసాద్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులుగా విజయ్, నంద

విశాలాంధ్ర నూజివీడు:మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) ఎం.విజయ్, కార్యదర్శిగా నందా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నూతన కమిటీ ఏఐటీయూసీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు చలసాని రామారావు, మాజీ మునిసిపల్ కౌన్సిలర్ ఐ. సత్యప్రకాష్, ఏఐటీయూసీ నూజివీడు నియోజకవర్గ కార్యదర్శి చాట్ల పుల్లారావు ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. నూతన కమిటీకి గౌరవాధ్యక్షుడిగా చలసాని వెంకటరామారావు, అధ్యక్షులు ఎం.విజయ్, కార్యదర్శిగా నంద, సహాయ కార్యదర్శి అల్లం కనక దుర్గ, ఉపా ధ్యక్షుడిగా ఎస్. హనుమం త రావు, కోశాధికా రిగా పి.శ్రీను,కమిటీ సభ్యులుగా యం. సుదర్శనం,బి.రవి,లక్ష్మణ, యం. జయరావు, పృథ్వీ,యం. రంగారావు, యం.రమేష్,టి. లక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ముద్రగడ క్షేమంగా రావాలని పూజలు

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : ప్రజలందరూ అభిమానాలతో మాజీ ఎంపీ, వైసిపి పిఎసి మెంబర్ ముద్రగడ పద్మనాభం క్షేమంగా రావాలని పూజలు నిర్వహించారు. తమ నాయకుడు ముద్రగడ పద్మనాభం ఆరోగ్యం బాగా మెరుగుపడి సంపూర్ణంగా వస్తారని పూజలు నిర్వహించినట్లు వైసీపీ మండల కన్వీనర్ రామిశెట్టి నాని అన్నారు. మండలంలో ప్రసిద్ధిగాంచిన ఎరకంపాలెం భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయంలో వైసిపి నాయకులు, అభిమానులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పూజా కార్యక్రమంలో బ్రహ్మచారి లక్ష్మానంద స్వామి సాయంత్రం ఈశ్వరునికి ప్రదోషకాల పూజలు నిర్వహించారు. రమణ మహర్షి ఆశ్రమంలో భగవాన్ రమణ మహర్షి దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు లొండ బాబు, దేవ లక్ష్మణ్, తుట్టా గోవింద్, తుంపటి శ్రీను, బొడ్డు చిన్నా, అడబాల బుజ్జి, రామకుర్తి సత్య రాజా తదితరులు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారానికి ప్రత్యేక చొరవచూపాలి : కలెక్టర్

విశాలాంధ్ర ఏలూరు: పిజిఆర్ఎస్ లో ప్రజలు సమర్పించిన అర్జీల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక చొరవచూపాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు.ఏలూరు కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో సోమవారం జిల్లా స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లాస్థాయి అధికారులతో నిర్వహించారు. జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వితో పాటు జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి వి. విశ్వేశ్వరరావు, జడ్పీ సీఈవో యం.శ్రీహరి,డీఆర్డీఏ పీడీ ఆర్.విజయరాజు,ఎస్సీ కార్పొరేషన్ ఈడీ యం.ముక్కంటి,డిఇఓ ఎం. వెంకట లక్ష్మమ్మ, సర్వే ఏడి అన్సారీ, ఎస్‌డీసి కె.భాస్కర్ అర్జీలు స్వీకరించారు. ఈసందర్భంగా వివిధ సమస్యల పరిష్కారానికి ప్రజలనుంచి 377 అర్జీలు అందాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ ఆయా శాఖల వారీగా వచ్చిన అర్జీలను పరిశీలించి పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. అర్జీల పరిష్కారంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, నిర్లక్ష్యానికి తావు లేకుండా అధికారులు, ఉద్యోగులు అంకిత భావంతో పనిచేయాలని సూచించారు. పీజేఆర్ ఎస్ లో ప్రజల నుంచి అందిన అర్జీల పరిష్కార సరళిపై ప్రధానంగా దృష్టి సారించాలన్నారు.పి జి ఆర్ ఎస్ కార్యక్రమాన్ని అత్యంత పారదర్శకంగా నిర్వహించి క్షేత్రస్థాయిలో ఉత్పన్నమయ్యే సమస్యలకు క్షేత్ర స్థాయిలోనే మంచి పరిష్కార మార్గాలు చూపించి అర్జీలు రీఓపెన్‌కు ఆస్కారం లేకుండా చూడాలన్నారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేటు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా దినోత్సవ ఏర్పాట్లు

విశాలాంధ్ర -భీమవరం: జిల్లాలో 15న 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ప్రణాళిక బద్ధంగా ఏర్పాట్లు చేయాలని ఇన్చార్జ్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ పిజిఆర్ఎస్ సమావేశ మందిరంలో ఇంచార్జి కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై వివిధ శాఖల జిల్లా అధికారులతో సమీక్షి నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను జాతీయ స్ఫూర్తి ఉట్టిపడేలా ఏర్పాట్లు చేయాలన్నారు. వేడుకలు నిర్వహించే కలెక్టరేట్ పెరేడ్ గ్రౌండ్స్‌ను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వేడుకల నిర్వహణకు వేదికను తగిన విధంగా అలంకరించి సిద్ధం చేయాలన్నారు. సీటింగ్ ఏర్పాట్లు, వీఐపిలకు ప్రత్యేక సీటింగ్ ఏర్పాట్లు చేయాలని , శానిటేషన్, తాగునీటి సరఫరా, తదితర ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. దేశభక్తి పెంపొందించేలా విద్యార్థులచే సాంస్కృతిక ప్రదర్శనలు వినూత్న తరహాలో అందరిని ఆకర్షించేలా నిర్వహించాలని విద్యాశాఖ అధికారిని ఆదేశించారు. సాంస్కృతిక ప్రదర్శనల్లో పాల్గొనే విద్యార్థినీ, విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా అన్ని ఏర్పాట్లు చేయటడంతో పాటు వారికి స్నాక్స్ ఏర్పాటు చేయాలని డిస్టిక్ సివిల్ సప్లయ్ అధికారిని ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ శానిటేషన్ ఏర్పాట్లను పర్యవేక్షించాలన్నారు. త్రాగునీటి ఏర్పాట్లను ఆర్ డబ్ల్యూఎస్ అధికారులు పర్యవేక్షించాలన్నారు. గ్రౌండ్ లో ఎక్కడా కూడా ప్లాస్టిక్ వాడకం ఉండకూడదని వాటర్ టిన్స్ ఏర్పాటు చేసి పేపర్ గ్లాసులు వినియోగించాలని అన్నారు. విద్యుత్ కు అంతరాయం లేకుండా చూడాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రతిబింబించే విధంగా స్టాల్స్ ఏర్పాటు, శకటాల ప్రదర్శన ఆకర్షణీయంగా అయా శాఖలు ఏర్పాటు చేయాలన్నారు. 79వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు సంబంధించి చేసే ఏర్పాట్లులో ఎటువంటి లోటు పాట్లుకు తావులేని విధంగా దగ్గర ఉండి పర్యవేక్షించాలని భీమవరం ఆర్డీఓ, మున్సిపల్ కమిషనర్, తహసిల్దార్ లను ఆదేశించారు. సమావేశంలో డిఆర్ఓ. మొగిలి వెంకటేశ్వర్లు, ఆర్డీవో కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, కె ఆర్ ఆర్ సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణ రెడ్డి, సిపిఓ కె.శ్రీనివాసరావు, గ్రామ వార్డు సచివాలయం అధికారి వై.దోసిరెడ్డి, డ్వామా పిడి డా.కె సి హెచ్ అప్పారావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రికల్ వర్కర్స్ వినూత్న నిరసన

విశాలాంధ్ర - రాజమండ్రి సిటీ : గోదావరి ఎలక్ట్రికల్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక విక్రమహాలులో ఎలక్ట్రికల్ వర్కర్స్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రికల్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ ప్రధాన కార్యదర్శి బొజ్జ రామకృష్ణ,యూనియన్ సభ్యులు పాల్గొన్నారు. ఎలక్ట్రికల్ సోదరుల ఆరోగ్య రీత్యా 20మంది ఎలక్ట్రికల్ సోదరుల కుటుంబాలకు ఈ.ఎస్.ఐ గుర్తింపు కార్డులు గౌరవ అధ్యక్షులు ఎం.వి.జి.వి ప్రసాద్ చేతుల మీదుగా అందజేశారు. ప్రెసిడెంట్ బొజ్జ రామకృష్ణ మాట్లాడుతూ, భవన నిర్మాణ కార్మికులు,ఎలక్ట్రిషన్ల పై ప్రభుత్వం అవలంబిస్తున్న నిరంకుశ వైఖరికి నిరసనగా చెవిలో పువ్వులు పెట్టుకుని నిరసన తెలియజేసారు. సీఎం చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్,మంత్రి లోకేష్ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రభుత్వం వచ్చిన 100 రోజుల్లో భవన నిర్మాణ కార్మికులకు అందరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చి ఇప్పటికి 500 రోజులు అవుతున్నా ఇప్పటికీ కూడా భవన నిర్మాణ కార్మికులకు మేలు అనేది ఏమాత్రం పరిగణలో తీసుకోలేని దుస్థితి ఏర్పడిందని విమర్శించారు. కార్మిక శాఖమంత్రి వాసంశెట్టి సుభాష్ కార్మికులను ఏమాత్రం పట్టించుకోవడం లేదని, భవన నిర్మాణ కార్మికులను నట్టేట ముంచుతున్న టువంటి మంత్రి ఇప్పటికైనా కార్మికులపై ప్రత్యేక శ్రద్ధ చూపించి ముందు అడుగు వేస్తారని భావిస్తున్నామని బొజ్జ రామకృష్ణ అన్నారు. కార్మికుల కుటుంబానికి మ్యారేజ్, డెలివరీ, మరణ సమయంలో సహాయం తీసేశారని, యాక్సిడెంట్ అయితే ప్రమాద బీమా తీసేసారని యాక్సిడెంట్‌లో మరణించినా బీమా తీసేసారని ఆవేదన వ్యక్తంచేశారు. ఆగస్టు 20న శ్రీకాకుళం లో జరిగే సభకు వివిధ జిల్లాల నుండి ఎలక్ట్రిషియన్లు హాజరు కావాలన్నారు. రాజమహేంద్రవరం చుట్టుపక్కల ఉన్నటువంటి ఎలక్ట్రికల్ సోదరులు గుర్తింపు కార్డు లేకుండా ఎవరు పని చేయరాదని, ఎలక్ట్రికల్ యూనియన్‌లో గుర్తింపు కార్డులు తీసుకొని దగ్గర పెట్టుకొని పని చేయాల ని ఆయన కోరారు. వైస్ ప్రెసిడెంట్ వీరవల్లి గంగా ఆచార్యులు, సెక్రెటరీ ఆశపు శ్రీనివాస్, బుజ్జి, జాయింట్ సెక్రెటరీ గోవాడ కొండబాబు, కోశాధికారి సుదర్శన్ షణ్ముఖం, సార్వకోట లక్ష్మణరావు, యూనియన్ ఆర్గనైజర్ సి మాల వీరభద్రరావు, కమిటీ మెంబర్స్ ఎడ్ల శేఖర్, గడ్డం ప్రసన్నకుమార్ , నిమ్మలపూడి రవివర్మ, పాలపర్తి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం

విశాలాంధ - ప్రత్తిపాడు : మండలంలోని చిన్న శంకర్లపూడి గ్రామంలో దళిత వాడలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం ఇల్లు కోల్పోయి నిరాశ్రయులైన ఆరు కుటుంబాల బాధితులను ప్రత్తిపాడు నియోజవర్గ వైసిపి నేత, నరసాపురం పార్లమెంటరీ పరిశీలకులు, ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళీ రాజు పరామర్శించి ఒక్కొక్క కుటుంబానికి రూ.10 వేలు చొప్పున బుర్రి మరిడమ్మ, మానూరి రాజబాబు, ముతకల నాగేశ్వరరావు, పిరాటి అచ్చారావు, పిరాటి అప్పారావు, పులగపూరి సత్యనారాయణ కుటుంబాలకు రూ.60 వేలు ఆర్థిక సహాయం చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా మురళి రాజు మాట్లాడుతూ ఈ అగ్ని ప్రమాదం జరగడం చాలా దురదృష్టకర విషయమని బాధితులకు ఎప్పుడు అండగా ఉంటానని తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని అగ్ని ప్రమాద బాధితులకు మూడేసి సెంట్లు చొప్పున నివేశన స్థలం కేటాయించడంతో పాటు పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలని ఆయన కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఏపూరి రామారావు, ఎంపీటీసీ పిల్లా కొండలరావు (చిన్న), ముదునూరి సీతారామరాజు, నానిపల్లి చంటి, యాళ్ల రమేష్, బొల్లు నాగేశ్వరరావు, మాజీ ఉప సర్పంచ్ పిడుగు సత్యనారాయణ, లక్కోజు నాగేంద్ర, జువ్వల దొరబాబు, పోకనాటి వెంకటేశ్వరరావు, నల్ల వెంకటేష్, తూపాటి బాబ్జి, దెందుకూరి హరిరాజు, గదుల శివ, జువ్వల ముసలయ్య, శ్రీను, అప్పారావు, తిమ్మిశెట్టి రాజా తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం

విశాలాంధ్ర - ఏలేశ్వరం : ఏలేశ్వరం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం స్థానిక వెంకటేశ్వర ఫంక్షన్ హాల్‌లో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రత్తిపాడు నియోజకవర్గ శాసన సభ్యురాలు వరుపుల సత్యప్రభ హాజరయ్యారు. అనంతరం పిఎసిఎస్ అధ్యక్షుడు సూతి బూరయ్య, సభ్యులతో ముందుగా రిజిస్టర్లో సంతకాలు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ మాట్లాడుతూ పాలకవర్గ సొసైటీ అభివృద్ధికి, రైతులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి తోడ్పాటునందించాలని నూతన పాలకవర్గాన్ని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ఏలేశ్వరం ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, జనసేన నాయకులు మేడిశెట్టి బాబి, కౌన్సిలర్లు బొద్దిరెడ్డి గోపి, అలమండ చలమయ్య, బిజెపి నాయకుడు సింగిలి దేవి సత్తిరాజు, బద్ది రామారావు, చిక్కాల లక్ష్మణరావు, ఎంపీటీసీ కొప్పుల బాబ్జి, బ్యాంకు రాజు, గట్టెం వెంకటరమణ, జ్యోతుల శ్రీనివాస్, సూతి బాబులు, చందువొలు రాజా, పాలకవర్గ సభ్యులు వైభోగుల సుబ్బారావు, కొప్పిశెట్టి సూరిబాబు తదితర కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

పేపర్ మిల్లు కాలుష్యం కోరల్లో రాజమండ్రి

విశాలాంధ్ర - రాజమండ్రి సిటీ : గోదావరి జలాలను రక్షించండి . ప్రజల ఆరోగ్యాలను కాపాడండి అని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ (ఆర్పిసి) ప్రధాన కార్యాలయంలో జరిగిన పార్టీ వారాంతపు సమావేశంలో ఆర్పిసి వ్యవస్థాపక అధ్యక్షులు మేడా శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు. రాజమండ్రి పరిసర ప్రాంతాల్లో ప్రజల ఆరోగ్యాలు క్షీణించడానికి "ఆంధ్రప్రదేశ్ పేపర్ మిల్లు" నుంచి విడుదలయ్యే ప్రమాదకరమైన రసాయినాలే ప్రధాన కారణమన్నారు. పేపర్ మిల్లు ద్వారా విడుదల అయ్యే విషపూరిత రసాయినిక వ్యర్థాలన్నీ నేరుగా గోదావరి లోకి చేర్చి, గోదావరి జలాలను తీవ్రంగా కలుషితం చేస్తున్నారన్నారు. రాజమండ్రి పరిసర ప్రాంతాల్లో ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రుల్లో రోగుల రద్దీ పెరగటానికి కారణం కూడా పేపర్ మిల్లు నుండి విడుదల అయ్యే వ్యర్థాలే కారణంగా భావించాలన్నారు. రాజమండ్రి పరిసర ప్రాంతాల్లో నివసించే ప్రజలంతా ఏదో ఒక అనారోగ్య సమస్యలతో తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారంటే అందుకు పేపర్ మిల్లు నిర్లక్ష్యమే నన్నారు. . గోదావరి జలాలు విషపూరితంగా మారి త్రాగునీరు కలుషితం అవుతున్నా సంబంధిత యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించటం వెనుక భారీగా అవినీతి ముడుపులునడుస్తున్నాయని ఆయన తీవ్రంగా ఆరోపించారు. పేపర్ మిల్లులో ప్రస్తుతం పని చేస్తున్న అనేక యంత్రాలు కాలం చెల్లినవని, ఏ రోజు ఏ ప్రమాదం జరుగుతుందో, ఏ ప్రాణ నష్టం సంభవిస్తుందో తెలియని ఆందోళనతో కార్మికులు విధులు నిర్వహి స్తున్నారని, కార్మిక రక్షణ , సంక్షేమం ముసుగులో కొన్ని ప్రధాన రాజకీయ పార్టీలు కార్మికుల భవిష్యత్ను వారి సొంత పనులకు తాకట్టు పెడుతున్నాయని, కార్మికుల జీవితాలను మిల్లు యాజమాన్యం అమ్మేస్తుందనడంలో ఏమాత్రం సందేహం లేదన్నారు. గతంలో కార్మికుల ఉద్యోగాలను " వారసత్వ " స్కీము ముసుగులో పెద్ద స్కామే చేసారని, ఇప్పటికి వారసత్వ బాధితులను, వారి కుటుంబాలను ఆ సమస్య వెంటాడుతూనే వుందని, వారసత్వ ద్వారా కార్మిక కుటుంబాల్లో వెలుగులు నింపుతామని నమ్మించి వారి జీవితాలను చీకటి చేసారని ఆయన విమర్శించారు. కాలుష్య నియంత్రణ శాఖ ఎవరి కోసం పని చేస్తుందో అర్థం కావటం లేదని, జీతాలు ప్రభుత్వం నుండి తీసుకుంటున్నారని, కానీ విధులు మాత్రం కాలుష్య పరిశ్రమలకు అనుకూలంగా చేస్తున్నారన్నారు. అలాగే, వాయు కాలుష్యంతో చర్మ వ్యాధులు, కంటి సమస్యలు రోజు రోజుకు పెరిగిపోతున్నాయని, చివరికి గోదావరి జలాలు ఆధారంగా జరిగే వ్యవసాయం సైతం విషంగా మారుతుందన్నారు. ఇంత స్థాయిలో రాజమండ్రి ప్రజల ఆరోగ్యాలు ప్రమాద స్థాయిలో ఉన్నప్పటికి కాలుష్య నియంత్రణ శాఖ కాసుల మత్తులో జోగుతోందని, పొల్యూషన్ బోర్డు అసమర్థత , అవినీతి కారణంగా ప్రతి ఏటా అనేక పరిశ్రమలు బెస్ట్ పొల్యూషన్ అవార్డులు అందుకుంటున్నాయని, పర్యావరణాన్ని కాపాడలేని పొల్యూషన్ బోర్డు ప్రజలకు అవసరం లేదన్నారు. ప్రత్యేక నిధులు ద్వారా గోదావరి నదిని పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేయటానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నడుం బిగించాలని మేడా ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. సభకు సీనియర్ సెక్యులర్ కామరాజు అధ్యక్షత వహించారు.

అర్జీల పరిష్కారంలో నిర్దిష్టమైన స్పష్టత ఉండాలి
సెక్రటరీ శైలజ వల్లి

విశాలాంధ్ర - రాజమండ్రి సిటీ : ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా అందే అర్జీలను పారదర్శకంగా, జవాబుదారీతనంతో అర్జీ దారుడు సంతృప్తిచెందేలా పరిష్కరించాలని సెక్రటరీ శైలజ వల్లి అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను సోమవారం నిర్వహించగాచ మొత్తం 26 అర్జీలు వచ్చాయి. వీటిలో ఇంజనీరింగ్ కి సంబంధించి 7, రెవెన్యూకి సంబంధించి రెండు, టౌన్ ప్లానింగ్ కి సంబంధించి 8, పబ్లిక్ హెల్త్ కి సంబంధించి రెండు, వార్డు సచివాలయాలకు సంబంధించి 4, అడ్మినిస్ట్రేషన్కు సంబంధించి ఒకటి, అకౌంట్స్ విభాగానికి సంబంధించి ఒకటి, మెప్మాకు సంబంధించి ఒకటి ఉన్నాయి. ఈ అర్జీలను ఆయా శాఖల అధికారులకు సూచిస్తూ.. వాటిపై సత్వరం సమగ్రమైన, సంతృప్తికరమైన పరిష్కారాలు అందించాలని సెక్రటరీ సూచించారు. అధికారుల దృష్టికి సమస్యను తీసుకువస్తే పరిష్కారమ వుతుందనే ఆశతో ప్రజలు గ్రీవెన్స్ సెల్ ను ఆశ్రయిస్తున్నారన్నారు. అర్జీ దారుడు పెట్టుకున్న నమ్మకానికి అనుగుణంగా అధికారులు సమస్యలను పరిష్కరించేందుకు చొరవ చూపాలన్నారు. అర్జీల పరిష్కారానికి విభాగాధి పతులే క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లి సమస్యను పరిష్కరించాలని.. అలాగే ఏ ఒక్క అర్జీ కూడా పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సిటీ ప్లానర్ జి.కోటయ్య, రెవిన్యూ ఆఫీసర్ సీహెచ్ శ్రీనివాస రావు, మేనేజర్ ఎండి అబ్దుల్ మాలిక్, అన్ని విభాగాల హెచ్.ఓడీలు, అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా సంజీవ్ గ్రూప్ ఆఫ్ కాలేజీల్లో జాతీయ వాణిజ్య దినోత్సవం '2025'

విశాలాంధ్ర - కాకినాడ : స్థానిక రామారావుపేట సంజీవ్ గ్రూప్ ఆఫ్ కాలేజ్లో జాతీయ వాణిజ్య దినోత్సవం 2025'ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భముగా కళాశాల చైర్మన్ పి రామ్ సంజీవ్ మాట్లాడుతూ దేశాభివృద్ధిలో వాణిజ్యం కీలక పాత్ర పోషిస్తుందని ఆయన అన్నారు. కళాశాల కరస్పాం డెంట్ పి ఆనంద రాయుడు మాట్లాడుతూ దేశాభివృద్ధిలో కామర్స్ విద్యార్థుల ప్రాముఖ్యతను ఆయన వివరించారు. అనంతరం వివిధ కళాశాల నుండి వచ్చిన విద్యార్థిని, విద్యార్థులకు నిర్వహించిన వివిధ రకాల చార్ట్స్, రోల్ ప్లే, పవర్ పాయింట్ ప్రెజెంటేషన్, కామర్స్ ఎగ్జిబిషన్, క్విజ్ మొదలైన పోటీలను నిర్వహించి నగదు బహుమతులను ప్రధానం చేశారు. ఈకార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డి భువన్ కుమార్, కళాశాల ఏ.ఒ పి శ్రీనివాస్, కళాశాల అకడమిక్ డీన్ సిహెచ్ రవి వర్మ, కళాశాల అకడమిక్ ఇన్ ఛార్జ్ టి కనక లక్ష్మి, కళాశాల కామర్స్ విభాగము హెచ్.ఓ డిటి ఉదయ్ కుమార్ మరియు అధ్యాపకులు, సిబ్బంది పాల్గొని విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

ఎన్నికల హామీ నిలబెట్టుకున్న ఎమ్మెల్యే దాట్ల
కాట్రేనికోన మార్కెట్కు కొత్త కళ

విశాలాంధ్ర - కాట్రేనికోన : ఎన్నికల్లో నాయకులు ఓట్లు కోసం ఎన్నో వాగ్దానాలు చేస్తారు. గెలిచాక ఆ ఊసే ఎత్తరు. కనీసం అటువైపు కన్నెత్తి కూడా చూడరు. ప్రస్తుత రోజుల్లో అవకాశవాద రాజకీయమే రాజ్యమేలుతున్న తరుణంలో ముమ్మిడివరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు ఎన్నో ఏళ్ల నాటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించారు. ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. గత ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీని కార్య రూపంలో పెట్టారు. వివరాల్లోకి వెళితే మండల కేంద్రమైన కాట్రేనికోనలో మార్కెట్ అధ్వానంగా ఉండేది. ఇక్కడ ప్రతి శనివారం జరిగే వారపు సంతకు మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు వస్తూ ఉంటారు. అలాగే ఇక్కడ150 కుటుంబాల వరకు నివాసం ఉంటున్నాయి. వారికి కనీస సౌకర్యాలు లేక మోకాలు లోతు మురుగు నీటిలో ఎన్నో ఇక్కట్లు పడేవారు. దుర్భర దయనీయ జీవితాలు గడిపేవారు. ఏచిన్నపాటి వర్షం వచ్చిన మురుగు నీరు బయటకు వెళ్లే దారి లేక మార్కెట్ ప్రాంతం ముంపునకు గురయ్యేది. సరైన రహదారి లేదు. ఏళ్లనాటి సమస్యను గత పాలకులకు స్థానికులు మొరపెట్టుకున్నా చెవిటి వాని ముందు శంఖం ఊదినట్లే ఉండేది. కూటమి ప్రభుత్వంలో అధికారం చేపట్టిన ఎమ్మెల్యే దాట్ల వచ్చిందే తడువుగా మార్కెట్ అభివృద్ధికి రు.50 లక్షలు మంజూరు చేయించి యాదాదికే పక్కా సిమెంట్ రోడ్లు, పక్కా డ్రైన్లు నిర్మించేశారు. దీంతో స్థానికంగా మురుగు నీటి సమస్య తీరి రహదారి సౌకర్యం కలిగింది. మార్కెట్ రూపురేఖలే మారిపోయాయి. ఇంకా మార్కెట్లో పల్లపు ప్రాంతాలను గ్రావెల్తో మెరక చేసి అభివృద్ధి చేయాల్సిన పని మిగిలి ఉంది. సకాలంలో నిధులు విడుదల చేసి మిగిలిన అభివృద్ధి పనులు పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న దాట్ల సుబ్బరాజుకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

పాఠశాలకు స్పోర్ట్స్ కిట్స్, దుస్తులు బహుకరణ

విశాలాంధ్ర- పాలకోడేరు : పాలకోడేరు మండలం గొల్లలకోడేరు ఉన్నత పాఠశాలలో 1986-91 సంవత్సరానికి సంబంధించిన 10వ తరగతి పూర్వ విద్యార్థులు పాఠశాలకు తమ వంతు సహాయం గా విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్స్, డ్రెస్సులు పాఠశాల ప్రధానోపాధ్యాయులు మంతెన రవి వర్మ కు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ప్రధాన ఉపాధ్యాయులు మాట్లాడుతూ జన్మనిచ్చిన తల్లిదండ్రు లను, విద్యాబుద్ధులు నేర్పిన గురువులను, చదువుకున్న పాఠశాలను మర్చిపోకూడదని దానిలో భాగంగా తాము చదువుకున్న పాఠశాలకు 1986 -91 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు ఈ విధంగా స్పోర్ట్స్ కిట్స్, డ్రెస్ లు అందజేయడం అభినందనీయం అన్నారు. ఇదే బ్యాచ్కి చెందిన విద్యార్థులు గతంలో కూడా పాఠశాలకు సంబంధించిన కొంత అభివృద్ధి కార్యక్రమంలో పాలు పంచుకున్నారని అన్నారు. అంతేకాకుండా వీరిని ఆదర్శంగా తీసుకుని మరికొంతమంది పూర్వ విద్యార్థులు ముందుకు వచ్చి పాఠశాల అభివృద్ధికి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పిడి శంకర్, పూర్వ విద్యార్థులు ఎం విజయ ప్రసాద్, పెరుమాళ్ళ శ్రీనివాస్, ఇసుకపల్లి కృష్ణంరాజు, రేవుల గడ్డ సుబ్బారావు, టేకు శ్రీను, కొల్లి పద్మావతి, శ్యామ సుందరి, కాంతరత్నం, దావీదు, సంపత్ రావు, కొల్లి సత్యనారాయణ, పిడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

విశాలాంధ్ర -భీమవరం: పట్టణంలో మౌలిక వసతులు కల్పించడానికి కృషి చేస్తున్నామని, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి అన్నారు. సోమవారం గునుపూడిలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని టీడీపీ నిర్వహించింది. ఈ సందర్భంగా తోట సీతారామలక్ష్మి ఇంటింటా తిరిగి కూటమి సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరించారు. కార్యక్రమంలో భాగంగా ఇస్త్రీ బండి వద్ద ఆగి రజకుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. టీడీపీ రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి మాట్లాడుతూ ఈనెల 15వ తేదీ నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కూటమి ప్రభుత్వం ప్రారంభించనున్నదని తెలిపారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తున్నామని, త్వరలోనే అన్ని పథకాలను లబ్ధిదారులకు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షుడు మద్దుల రాము, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు మామిడిశెట్టి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రమంత్రి శ్రీనివాసవర్మకు శుభాకాంక్షల వెల్లువ

విశాలాంధ్ర -భీమవరం: భీమవరంలోని కేవస్ రాజు ఫంక్షన్ హాల్ లో జిల్లా బిజెపి ఆధ్వర్యంలో కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేంద్రమంత్రి శ్రీనివాస వర్మకు శుభాకాంక్షలు తెలిపేందుకు పెద్ద సంఖ్యలో ప్రజా ప్రతినిధులు, ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. రాష్ట్ర జలవనరుల శాఖామంత్రి నిమ్మల రామా నాయుడు, శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషన్ రాజు, బిజెపి మాజీ రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్, భీమవరం ఎమ్మెల్యే, పిఎసి చైర్మన్ పులపర్తి రామాంజనేయులు, నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, జనసేన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులు కొటికలపూడి గోవిందరావు , మాజీ రాజ్యసభ సభ్యురాలు తోట సీతారామలక్ష్మి, ఇంచార్జ్ జిల్లా కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి, జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి , భీమవరం డిఎస్పీ ఆర్.జయసూర్య, డిసిఎంఎస్ చైర్మన్ చాగంటి మురళీకృష్ణ, పలువురు సిఐలు, ఎస్సైలు, జిల్లా స్థాయి అధికారులు, పలు నియోజకవర్గాల బిజెపి, టిడిపి, జనసేన ఇన్చార్జిలు తరలివచ్చి కేంద్ర మంత్రికి శుభాకాంక్షలు తెలిపారు. అంతకుముందు కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ పుట్టినరోజు సందర్భంగా కేవస్ రాజు ఫంక్షన్ హాల్ లో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరం, ఉచిత ప్రత్యేక వైద్య శిబిరం, ఉచిత కంటి వైద్య శిబిరాన్ని కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ ప్రారంభించగా పెద్ద సంఖ్యలో కార్యకర్తలు స్వచ్ఛందంగా రక్తదానం చేసి శ్రీనివాస వర్మ పైన తమ అభిమానాన్ని చాటుకున్నారు. భారీగా ప్రజలు తరలివచ్చి కంటి పరీక్షలు, వైద్య సేవలు అందుకున్నారు.

త్వరలో ఎన్‌హెచ్ -165 గ్రీన్ ఫీల్డ్ ప్రాజెక్టు పనులు ప్రారంభం

- కేంద్ర ఉక్కు, భారీపరిశ్రమలశాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ

విశాలాంధ్ర -భీమవరం: ప్రజాప్రతినిధిగా తన పదవీకాలంలో నర్సాపురం పార్లమెంట్ పరిధిలో చిరస్మరణీయంగా ప్రజలు గుర్తుపెట్టుకునే అభివృద్ధి కార్యక్రమాలు చేస్తానని కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమలశాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. ఎన్ హెచ్ -165 గ్రీన్ ఫీల్డ్ ప్రాజెక్టుకు 2500 కోట్లు మంజూరు చేసిన కేంద్రమంత్రి నితిన్ గడ్కరికి నరసాపురం ప్రాంత ప్రజల తరపున ఆయన చిత్రపటానికి శ్రీనివాస వర్మ పాలాభిషేకం చేశారు. సోమవారం భీమవరంలోని కె ఎస్ రాజు ఫంక్షన్ హాల్ లో జిల్లా బిజెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తన పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్న కేంద్ర మంత్రి విలేకరులతో మాట్లాడారు. గత ఎన్నికల్లో నర్సాపురం లోక్‌సభ అభ్యర్థిగా పోటీ చేసిన సమయంలో తనకు ఆర్థికంగా బలం లేదని బలహీన అభ్యర్థి అని కొందరు అసత్య ప్రచారం చేసిన తనకు బిజెపి కేంద్ర, రాష్ట్ర నాయకత్వంతో పాటు టీడీపీ, జనసేన అధినేతలు చంద్రబాబు, పవన్ కళ్యాణ్ అండగా నిలిచి ప్రోత్సహించాలన్నారు. ఎన్డీఏ కూటమిలోని మూడు పార్టీల కార్యకర్తల కృషి, ప్రజల ఆశీర్వాదంతో రికార్డ్ స్థాయి భారీ మెజార్టీతో తాను ఎన్నికల్లో గెలుపొందానన్నారు. ప్రతి పుట్టినరోజు ఒక వేడుకగా చేసుకునే కంటే తాము పుట్టి దేశానికి, సమాజానికి ఏమి చేశామనేదే చాలా ముఖ్యం అనేది తన అభిప్రాయం అని శ్రీనివాస వర్మ అన్నారు. 35 సంవత్సరాలుగా రాజకీయాల్లో ఉండి ప్రజల ఇబ్బందులు తెలిసిన వ్యక్తిగా, స్థానిక సంస్థలలో పని చేసిన ఒక సాధారణ కార్యకర్త ఢిల్లీ స్థాయిలో ప్రజా ప్రతినిధిగా ఎన్నికైతే ఏ విధమైన అభివృద్ధి చేస్తారో ప్రజా సమస్యల పరిష్కారానికి ఏ విధంగా కృషి చేస్తారో భవిష్యత్తులో తాను చేసి నిరూపిస్తా అని శ్రీనివాస వర్మ అన్నారు. కొత్త ఆకివీడు - దిగమర్రు వయా భీమవరం బైపాస్ 165 గ్రీన్ ఫీల్డ్ హైవే పనులు త్వరలో ప్రారంభిస్తామని, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి 45 కిలోమీటర్ల కొత్త గ్రీన్ ఫీల్డ్ నాలుగు లైన్ల 165 జాతీయ రహదారి నిర్మాణానికి 2500 కోట్ల రూపాయలు ప్రకటించడం ఎంతో సంతోషాన్నిచ్చిందని ఆయన పేర్కొన్నారు. మరోవైపు మధ్యలో నిలిచిపోయిన ఎన్ హెచ్ -216 నరసాపురం బైపాస్ రోడ్డు పనులకు సంబంధించి కోర్టు కేసులు రెండు నెలల్లో పరిష్కరించి నిర్మాణ పనులు ప్రారంభించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన అన్నారు. ఈ బైపాస్ రోడ్డు నిర్మాణానికి సుమారు 600 కోట్ల రూపాయలు పైగా అయ్యే అవకాశం ఉందని ఆయన తెలిపారు. లోసరి నుండి పిప్పర వరకు సిఆర్ఎఫ్ నిధుల కింద 100 కోట్లతో నిర్మిస్తున్న రోడ్డు నిర్మాణంతోపాటు తాడేపల్లి గూడెం నుండి భీమవరం కొత్త గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మించడానికి ప్రతిపాదనలు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ దృష్టికి తీసుకువెళ్లానని అన్నారు. త్వరలోనే డిపిఆర్ సిద్ధం చేసి అనుమతులు సాధిస్తానని ఆయన తెలిపారు. కొత్త గ్రీన్‌ఫీల్డ్ హైవే భీమవరం- తాడేపల్లిగూడెం- నల్లజర్లకు కనెక్ట్ అయ్యే విధంగా తాను ఇచ్చిన ప్రతిపాదనకు నేష నల్ హైవే అధికారులు సానుకూలంగా స్పందించారని త్వరలోనే ఈ ప్రాజెక్టు పట్టాలెక్కిస్తానని చెప్పారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గం పరిధిలో నాలుగు ఫ్లైఓవర్లు మంజూరు చేయించానని వాటికి త్వరలోనే టెండర్లు పిలిచే విధంగా ఆదేశాలు ఇచ్చినట్లు కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ తెలిపారు. భీమవరం పట్టణంలో కోడపల్లి రోడ్డు, బైపాస్ రోడ్డు, కాస్మో క్లబ్ రోడ్డులో ఉన్న రైల్వే క్రాసింగ్ ల వద్ద కొద్ది నెలలోనే ఫ్లై ఓవర్ బ్రిడ్జిల నిర్మాణం చేస్తామని శ్రీనివాస్ వర్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిజెపి అధ్యక్షురాలు శ్రీమతి అయినం పూడి శ్రీదేవి, మాజీ జిల్లా అధ్యక్షులు నార్ని తాతాజీ, బిజెపి నరసాపురం పార్లమెంట్ కన్వీనర్ పేరిచర్ల సుభాష్ రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శులు కలిదిండి వినోద్ వర్మ, తోట గంగరాజు, బిజెపి సీనియర్ నాయకురాలు మారుతీ రాణి, జిల్లా ఉపాధ్యక్షులు సురేంద్ర పాల్గొన్నారు.

రెడ్ రిబ్బన్ క్లబ్ క్విజ్‌లో రాష్ట్రస్థాయికి ఎంపిక
పోటీలో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు

విశాలాంధ్ర - ఏలూరు :రెడ్ రిబ్బన్ క్లబ్ క్విజ్ జిల్లాస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేసినట్లు డిస్ట్రిక్ట్ లెప్రసీ, ఎయిడ్స్ టీబీ ఆఫీసర్ డాక్టర్ నరేంద్ర కృష్ణ తెలిపారు.ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ వారి ఆదేశానుసారం ఏలూరు జిల్లా డిస్ట్రిక్ట్ ఇంటిగ్రేటెడ్ (స్ట్రాటజిక్ హెచ్ఐవి ఎయిడ్స్ కార్యక్రమం ద్వారా ఏలూరు జిల్లాలో గల జూనియర్ ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థులకు రెడ్ రిబ్బన్ క్విజ్ జిల్లా వ్యాప్తంగా ఏలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమమునకు డిస్ట్రిక్ట్ ఒకేషనల్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ పి.శేఖర్ బాబు, ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ రీజనల్ ఇన్స్పెక్టింగ్ ఆఫీసర్ టి.యోహాన్, ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ రాజ్ కృష్ణ,డిస్ట్రిక్ట్ లెప్రసీ, ఎయిడ్స్ టీబీ ఆఫీసర్ డాక్టర్ నరేంద్ర కృష్ణ, ఏలూరు తూర్పుగోదావరి జిల్లా క్లస్టర్ మేనేజర్ జి ఆదిలింగం, క్లినికల్ సర్వే విలన్స్ ఆఫీసర్ హరినాథ్ కుమార్ దిశా బృందం సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విజేతలైన వారికి ప్రథమ బహుమతిగా పొందిన విజేతలు ఏలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల చెందిన జి.సుమశ్రీ,ఎం. సుశాంత్ రూ.5 వేలు,ద్వితీయ బహుమతి పొందిన విద్యార్థులు కైకలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన టీ తన్మయి, డి దేవి హర్షిని, రూ. 4వేలు, తృతీయ బహుమతి విజేతలుగా చింతలపూడి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ఎస్ కే సహారా,ఎస్ మౌనికలు రూ. 3వేలు గెలుపొందారు. వీరిని నిర్వాహకులు అభినందించారు.త్వరలో నిర్వహించబోయే స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో వీరికి నగదు బహుమతులు అందజేయనున్నారు

వరలక్ష్మి వ్రతం జనరల్ హాలిడేగా డిక్లేర్‌పై హర్షం

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : రాష్ట్రంలోని హిందువుల మనోభావాలను గౌరవిస్తూ వరలక్ష్మి వ్రతం పర్వదినాన్ని ఆప్షనల్ హాలిడే నుంచి తొలగించి జనరల్ హాలిడేగా డిక్లేర్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వానికి రాష్ట్రంలోని ఉన్న హిందువుల తరపున కూటమి పార్టీల నాయకులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు రాష్ట్ర వినియోగదారుల సంఘం ఉపాధ్యక్షులు ఏ ఆర్ కే హనుమంతరావు ఒక ప్రకటనలో తెలిపారు.

ఆంగ్లం పై పట్టు సాధించడం అవసరం

- ఆదిత్య యూనివర్సిటీ ప్రో ఛాన్సలర్ -డా సతీష్ రెడ్డి

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం సూరంపాలెం. ఆదిత్య యూనివర్సిటీకి చెందిన బి టెక్ సిఎస్ఇ బ్రాంచ్‌కి చెందిన మొదటి సంవత్సరం విద్యార్థులకు నేటి నుంచి తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విద్యార్థి తల్లిదండ్రుల సమావేశంలో యూనివర్సిటీ ప్రో ఛాన్సలర్ డా నల్లమిల్లి సతీష్ రెడ్డి అధ్యక్షత వహించి మాట్లాడుతూ విద్యార్థులు తమ కర్తవ్యాన్ని లక్ష్యాలను నిరంతరం గుర్తెరిగిమసలుకోవాలి అన్నారు. ఉన్న స్థాయి నుంచి ఉన్నత స్థాయికి చేర్చేది విద్య మాత్రమే అని అన్నారు. ఆదిత్య పై అపార నమ్మకంతో తమ చిన్నారులను తమ సంస్థలో చేర్పించిన తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ విద్యార్థి ఉన్నతికి ఆదిత్య యాజమాన్యం ఎల్లవేళలా కృషి చేస్తుందని అయితే తల్లిదండ్రులు మీ వంతు సహకారం ఆదిత్యకు అందిస్తే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవడం ఎంతో సులభం అని తెలిపారు. ఇంజనీరింగ్ విద్యార్థులు ఆంగ్లం పై పట్టు సాధించి నప్పుడే బి టెక్ పట్టాతో పాటు మంచి వార్షిక ఆదాయంతో ఉద్యోగ నియామక పత్రంతో కళాశాల నుండి నేరుగా ఉద్యోగంలో అడుగు పెట్టవచ్చు అని అందుకు ఆదిత్య తీసుకుంటున్న ప్రణాళిక బద్ధమైన నియమనిబంధనలు అనుసరించవలసిన భాధ్యత విద్యార్థులపై ఉందని అన్నారు. విద్యార్థి యొక్క నియమావళి ఆదిత్య నిబంధనలు హాజరు ప్రాముఖ్యత వారాంతపు నెలవారీ పరీక్షల వివరాలు తదితర విషయాల గురించి విభాగాధిపతి తెలిపారు. విద్యార్థికి ఉండవలసిన లక్షణాలు, దీక్ష, పట్టుదల, గురించి వివరించారు. తాను ఏమి కావాలనుకుంటున్నారు అనే విషయంపై నిర్దిష్టమైన అభిప్రాయం ఏర్పాటు చేసుకుని ఆ మార్గంలో ముందుకు సాగాలని సూచించారు. సరైన విధానంలో ఉపయోగిస్తే విజ్ఞానంతో ఎంత అభివృద్ధి సాధించవచ్చు అనే విషయాన్ని ఏఐ ద్వారా వివరించారు. చెడుకు వినియోగిస్తే అధోగతి పాలవడం జరుగుతుందని మనం ఏవిధంగా మసలుకోవాలి అనే విజ్ఞత కలిగి ఉండాలని డా సతీష్ రెడ్డి వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డా ఎం శ్రీనివాస రెడ్డి, వైస్ ఛాన్సలర్ ప్రో ఎం, బి, శ్రీనివాస్, ప్రో వైస్ ఛాన్సలర్స్ డా ఎస్ రమాశ్రీ, డా ఆదిరెడ్డి రమేష్, రిజిస్ట్రార్ డా జి సురేష్, టెక్నికల్ హబ్ సిఈఓ బాబ్జి నీలం, విభాగాధిపతులు విద్యార్థినీ, విద్యార్థులు తల్లితండ్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

యాప్‌ల భారం మోయలేక పోతున్నాం

- మొబైల్స్ అప్పగించే ప్రక్రియలో అంగన్వాడీలు





విశాలాంధ్ర – తాళ్లపూడి : ఐ.సి.డి.ఎస్ పరిధి లో పనిచేసే అంగన్వాడీ కేంద్రాల నిర్వహణలో పెరిగిన యాప్‌ల భారాన్ని మోయలేక పోతున్నా మని, సాంకేతిక ఇబ్బందుల కారణంగా మరిన్ని ఇబ్బందులు నిత్యం ఎదుర్కోటున్నామని అంగన్ వాడిలు వాపోతున్నారు. మిగతా డ్యూటీ లతో పాటు యాప్‌లను వినియోగించడం పెద్ద భారంగా మా రిందని అన్నారు. మొబైల్ లో పోషణ, ట్రాకర్ యాప్, సంజీవిని, మిల్క్ టీ.ఎచ్.ఆర్ యాప్ లలో వివరాలు అప్‌లోడ్ చేసే సమయంలో ఫోన్ సిగ్నల్స్ లేకపోవటం వల్ల పని ఆగిపోతుందని అన్నారు. గర్భిణీ ల విష యానికి వస్తే నెలకు రెండు సార్లు టి.ఎస్.ఆర్ ఇచ్చేందుకు అవకాశం ఉండటం లేదని అన్నారు. ఈ యాప్‌ల అదనపు భారానికి తోడు పింఛన్ల పం పిణీ కూడా తమ కే కేటాయించారని కూడా తెలిపారు. రాష్ట్ర వ్యాప్తం గా సి.ఐ.టి.యు అనుబంధ సంస్థగా ఉన్న అంగ న్వాడి వర్కర్ల సంఘం సిడిపిఓ కార్యాలయంలో హ్యాండ్రాయిడ్ ఫోన్ లు ఆగించా మన్నారు. కాగా యాప్‌లను తట్టుకునే సామర్థ్యం కలిగిన కొత్త ఫోన్లు సరఫరా చేయాలని, పనిభారం, యాప్‌ల భారం తగ్గించాలని, ఎప్పుడో పెంచుతానన్న జీతాలను తక్షణం పెంచాలని, వారు డిమాండ్ చేస్తున్నారు.

విశాలాంధ్ర- కొవ్వూరు : ఐసిడిఎస్ పరిధిలో అంగన్వాడి సెంటర్ నిర్వహణకు ఆన్లైన్ వర్క్ చేయుటకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఫోన్లు సపోర్ట్ చేయక పనిచేయకపోవడం 5జి సదుపాయం లేక పోవడం కారణంగా లబ్దిదారులు సెంటర్ నిర్వా హకులు తీవ్రఇబ్బందులు పడుతున్నామని రాష్ట్ర ప్రభుత్వానికి పలుమార్లు విజ్ఞప్తి చేసిన పట్టించుకోని కారణంగా సోమవారం రాష్ట్ర సంఘం పిలుప మేరకు కొవ్వూరు ఐసిడిఎస్ పరిధిలోని చాగల్లు తాళ్లపూడి కొవ్వూరు మండలాల అంగన్వాడీ కార్య కర్తలు ప్రభుత్వం ఇచ్చిన ఫోన్లను అధికారులకు అందజేశారు ఈ కార్యక్రమానికి.సి. హెచ్.మాణి క్యాంబ ఎన్. వసంత కుమారి బి.శ్రీదేవి పి.గౌతమి ఎ.అమరావతి కె.సుజాత టి.విజయ కుమారికె. లక్ష్మీ సి. హెచ్.బ్రహ్మా ఎన్.సీతా రత్నంపి. చైతన్య కే.సి. లక్ష్మీఆర్. రమాదేవి తదితరులు నాయకత్వం వహించారు. వర్కర్స్, హెల్పర్స్ పాల్గొన్నారు.